# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 29-11-2024 ₹ 15/-

# న్యాయైన రాజ్యం



గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 47 హైదరాబాద్
శుక్రవారం 29 నవంబర్ 2024 రూ.15-00
26 జమాది ఉల్ ఊలా 1446 హిజ్రీ


**తొలిగీటు**

ఒక విశ్వాసి మరొక విశ్వాసికి దర్పణం లాంటివాడు. ఒక విశ్వాసి మరొక విశ్వాసికి సోదరునితో సమానం.

– మహాప్రవక్త ముహమ్మద్ (ప్రఅసం)


సంపాదకులు
ఎస్.ఎమ్. మలిక్

అసోసియేట్ ఎడిటర్
అబ్దుల్ వాహెద్

ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి
ముహమ్మద్ ముజాహిద్

గ్రాఫిక్స్
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్

సర్క్యులేషన్ మేనేజర్
అబ్దుల్ జలీల్, 9704317015



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




16

## ఓడ ప్రయాణం

## లోపల...


| | | |
|---|---|---|
| మరో బాబరీ | ...... | 04 |
| న్యాయేన రాజ్యం | ...... | 05 |
| న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి | ...... | 08 |
| సమన్యాయ స్థాపనకు సంకల్పించాలి! | ...... | 12 |
| చారిత్రక సమావేశంలో అవకాశం దొరికింది | ...... | 13 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఏడు దశాబ్దాల జమాఅత్ | ...... | 20 |
| సివిల్స్‌లో నామమాత్రంగా ముస్లింల ప్రాతినిధ్యం | ...... | 24 |
| వక్ఫ్ ప్రాపర్టీ అల్లాహ్ ఆస్తి | ...... | 26 |
| చరితార్థులు-2 : కల్నల్ జి. క్యూ. జీలాని | ...... | 29 |
| ప్రతిభకు చదువు అవసరమా? | ...... | 30 |
| ముస్లిమేతరులతో ప్రవక్త (స) | ...... | 32 |
| మూడు శాపాల నుండి తప్పించుకోండి! | ...... | 34 |


### అందరూ అందరే...




రాజకీయం అంటేనే
లాభసాటి వ్యాపారం
సేవ అనే ముసుగులో
దోచుకొనే యవ్వారం!
వారు వీరు ఎవరైనా
అందరిదీ ఒకే బాట
పైకి ఎన్ని తిట్టుకున్న
లోపలంత ఒకేమాట!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

# మరో బాబరీ

**అయోధ్యలో** బాబరీ మస్జిదు తర్వాత 16వ శతాబ్దం నాటి మరో మస్జిదుపై మతతత్వ శక్తుల దృష్టి పడింది. ఉత్తరప్రదేశ్, సంభాల్‌లోని జామా మస్జిదుపై వారు వివాదం రాజేస్తున్నారు. సంభాల్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో విష్ణు శంకర్ జైన్ అనే న్యాయవాది పిటీషన్ వేసిన మూడు గంటల్లోనే జడ్జిగారు ఆ మస్జిదులో సర్వే కొరకు ఆదేశించారు. పోలీసు బందోబస్తుతో సర్వే నిర్వహించారు.

ఈ మస్జిదు 500 సంవత్సరాల చరిత్ర ఉన్న మస్జిదు. అక్కడ రోజువారి నమాజులు కూడా జరుగుతున్నాయి. సర్వేలో అక్కడ ఏమీ దొరకలేదు. మందిరాన్ని కూల్చి బాబర్ కాలంలో ఈ మస్జిదు కట్టారని, హరిహర మందిరాన్ని కూల్చి 1529లో ఈ మస్జిదు కట్టారని వివాదం రాజేస్తున్నారు. అయోధ్య వివాదం నుంచి పిండుకోవలసిన రాజకీయ ప్రయోజనాలన్నీ పిండుకున్నారు కాబట్టి ఇప్పుడు కొత్త వివాదాలు రాజేయాలి.

బాబర్ పాలించింది ఐదేళ్ళే. 1526 నుంచి 1530 మధ్య కాలంలో బాబర్ కట్టించిన మస్జిదులు మూడే. అవి అయోధ్యలో బాబరీ మస్జిదు, సంభాల్‌లో జామా మస్జిదు, పానిపట్‌లో మరో మస్జిదు కట్టించాడు, అది ఇప్పుడు శిధిలావస్థలో ఉంది. సంభాల్ జామా మస్జిదు సర్వే కోసం అధికారులు రావడంతో అక్కడి పార్లమెంటు సభ్యుడు జియావుర్రహ్మాన్ జోక్యం చేసుకుని స్థానికంగా ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితిని చల్లబరిచారు. జియావుర్రహ్మాన్ మాట్లాడుతూ ఎలాంటి నోటీసు లేకుండా హడావిడిగా ఈ సర్వే కోసం రావడమేమిటని ప్రశ్నించారు. పైగా ఈ మస్జిదు ఆరాధనాలయాల స్థలం 1991 క్రింద భద్రత పొందుతున్న మస్జిదు. ఈ మస్జిదుపై పిటీషన్ వేసిన హరి శంకర్ జైన్ ఎవరో కాదు, వారణాసి, మధుర మస్జిదులపై పిటీషన్లు వేసిన ఆయనే. ఒక పథకం ప్రకారం దేశంలో మస్జిదులపై పిటీషన్లు వేయించి, మత ఉద్రిక్తతలు రాజేసే ప్రయత్నాలు ఇప్పుడు జోరందుకున్నాయి.

మజ్లిస్ నాయకుడు ఒవైసీ మాట్లాడుతూ బాబరీ మస్జిద్ తీర్పు తర్వాత మతశక్తులు పేట్రేగిపోతున్నాయని చెప్పారు. పిటీషన్ వేసిన మూడు గంటల్లోనే న్యాయమూర్తి సర్వేకు ఆదేశాలిచ్చారని, ఇతర కేసుల్లో ఎప్పుడైనా ఇంత వేగంగా న్యాయస్థానం స్పందించడం జరిగిందా అని ప్రశ్నించారు.

గమనించవలసిన మరో విషయమేమిటంటే, ఉత్తరప్రదేశ్ లో ప్రతిష్ఠాత్మకస్థాయిలో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఉప ఎన్నికల పోలింగ్‌కు కేవలం కొన్ని గంటల ముందు ఈ సర్వే ఆదేశాలు వచ్చాయి. సర్వే జరిగింది. ఎన్నికలకు ఈ సర్వే ఆదేశాలకు సంబంధం ఉందని, ఓటర్లను ప్రభావితం చేయడానికి ఇదొక కుట్ర అనే వాదన ప్రచారంలో ఉంది.

కాస్త వెనక్కి వెళితే 2014లో ఎన్నికలప్పుడు కూడా ఈ వివాదం రాజేసారన్నది గుర్తుకు వస్తుంది. అప్పుడు కూడా ఎన్నికలకు ముందే ఈ వివాదాన్ని రాజేశారు. ఇప్పుడు కూడా ఎన్నికలకు ముందే ఈ వివాదాన్ని రాజేసారు. గమనార్హమైన ఆసక్తికర విషయమేమిటంటే, అప్పట్లో సమాజ్‌వాది పార్టీ తరపున పార్లమెంటుకు షఫీకుర్రహ్మాన్ బార్క్ పోటీ చేశాడు. అప్పట్లో మత తత్వ శక్తుల ప్రాబల్యం ఉధృతంగా ఉండడంతో బీజేపీ అభ్యర్థి సత్యపాల్ సింగ్ సైని గెలిచాడు. అప్పుడు కాంగ్రెస్ తరపున పోటీ చేసిన వ్యక్తి ఆచార్య ప్రమోద్ కృష్ణం. ఈ ప్రమోద్ కృష్ణం అప్పట్లో ఈ వివాదం గురించి మాట్లాడుతూ కల్కి అవతారానికి కావలసిన సానుకూల పరిస్థితులు కేవలం సంభాల్‌లోనే ఉన్నాయని చెప్పిన విషయం గుర్తుకు తెచ్చుకోవాలి. ఈ ప్రమోద్ కృష్ణం తర్వాత ప్రధాని మోడీని ప్రశంసలతో ముంచెత్తిన సంగతి కూడా గుర్తుకు తెచ్చుకోవాలి. ఇప్పుడు ఈ ప్రమోద్ కృష్ణం సంభాల్‌లోనే కల్కి థామ్ నిర్మించారు. ఈ కల్కిథామ్ ప్రారంభోత్సవానికి మోడీ కూడా హాజరయ్యారు. కాంగ్రెసు పార్టీలో ఇలాంటి నేతలు చాలామంది ఉన్నారు. అవసరమైనప్పుడు వారు తమ మతతత్వ ముఖాన్ని చూపిస్తుంటారు. కాంగ్రెసు పార్టీ ఈ నేత లను వదిలించుకుంటుందా లేక సాఫ్ట్ హిందూత్వ బాటనే నడుస్తుందా అనేది వేచి చూడాలి.

ఏది ఏమైనా సంభాల్‌లో మరో బాబరీ వివాదానికి పునాదు లేస్తున్నారు. వారణాసి, మధుర వివాదాలు మరోవైపు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ వివాదాలు ఎంత కాలం మతతత్వ శక్తులకు గెలుపునందిస్తాయో కాలమే చెప్పాలి. ✤

**కవరు కథనం** **అబ్దుల్ వాహెద్**




# న్యాయైన రాజ్యం

**న్యాయ ధ్వజవాహకులుగా** నిలబడడం మీ ధార్మిక బాధ్యత అని, అన్యాయం, అత్యాచారాలను తొలగించి న్యాయాన్ని స్థాపించడానికి ప్రయత్నించాలని జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదతుల్లా హుసైనీ జమాఅత్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

దివ్యఖుర్ఆన్ కూడా ఇదే చెబుతోంది-

**“విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సన్నిహితమైనది”**

***(దివ్యఖుర్ఆన్: 5:8)***

న్యాయం లేనిదే రాజ్యం లేదు. ధర్మం లేనిదే మనిషి జీవితమే లేదు. ధర్మేన హీనం ఖలు జీవితం...

ధర్మం న్యాయం చేయాలని చెబుతుంది.

న సత్యాత్పరమో ధర్మో, నానృతాత్పతకం పరమ్ - సత్యం కంటే గొప్ప ధర్మం లేదు, అనృతవచనం అంటే అబద్దం కంటే పాతకం లేదని సుభాషితాలు చెబుతున్నాయి.

ధర్మం సత్యం పలకాలని చెబుతుంది. సత్యం న్యాయాన్ని నిలబెడుతుంది. న్యాయాన్ని నిలబెట్టడం ధార్మిక బాధ్యత.

సత్యేన ధార్యతే పృధ్వి, సత్యేన తపతీ రవీ

సత్యాన్నే భూమి ధరించింది... సత్యం వల్లనే సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. కాని మనిషి సత్యాన్ని వదలి అన్యాయాంధకారంలో కూరుకుపోతున్నాడు. న్యాయం అంటే సమన్యాయం, న్యాయం సమక్షంలో సమానత్వం. సమన్యాయాన్ని కాపాడితేనే సమాజంలో శాంతి, సుహృద్భావం, సామరస్యం, సంతోషం ఉంటాయి.

అందుకే “న్యాయధ్వజవాహకులుగా నిలబడండి” అనే నినాదంతో జమాఅతె ఇస్లామీ హింద్ హైదరాబాద్ నగరంలో అఖిల భారత సర్వసభ్య సదస్సు నిర్వహించింది.

దివ్యఖుర్ఆన్ న్యాయం గురించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

**“న్యాయధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీ కంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు అని.” (4:135)**

ఈ ఖుర్ఆన్ వాక్యం ప్రేరణగా జమాఅతె ఇస్లామీ హింద్ సమన్యాయం కోసం పిలుపునిస్తూ ఈ సదస్సు నిర్వహించింది.

జమాఅతె ఇస్లామీ హింద్ గత ఏడు దశాబ్దాలుగా దేశంలో ధార్మిక, సామాజిక సేవలందిస్తోంది.

జమాఅతె ఇస్లామీ హింద్ మూడురోజుల సదస్సు ముగింపు సందర్భంగా జమాఅత్ అధ్యక్షులు సయ్యద్ సాదతుల్లా హుసైనీ ప్రసంగం ఈ సందర్భంగా గమనార్హమైనది. న్యాయం కోసం, సత్యంకోసం సాక్షులుగా నిలబడడం ప్రతి ముస్లిం బాధ్యత అని ఆయన అన్నారు. అన్యాయాలు, దౌర్జన్యాలను తొలగించి సమన్యాయస్థాపన కోసం ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. నిజానికి సమాజంలో శాంతిసౌహార్ధత సంతోషాల కోసం అందరూ చేయవలసిన పని ఇది. ఒక మెరుగైన సమాజం ఏర్పడాలంటే ఇది అందరూ చేయవలసిన పని. అల్లర్లు, ఉద్రిక్తతలు, అన్యాయాలు లేని సమాజం ఎలా సాధ్యమో చూపించాలి. రవీంద్ర నాథ్ ఠాగూర్




తన కవితలో అలాంటి సమాజాన్నే కోరుకున్నారు.
భయాందోళనలు లేని,
తల ఎత్తుకుని బతికే
జ్ఞానం అందరికీ లభించే
సంకుచితత్వం గోడలు లేని

సత్యం లోతుల నుంచి మాటలు వినిపించే ... స్వేచ్ఛా స్వర్గం వంటి సమాజాన్ని ఆయన తన కవితలో అభిలషించారు. అలాంటి సమాజం ఏర్పడాలంటే న్యాయాన్ని, సత్యాన్ని కాపాడడం అందరి బాధ్యత. అదే బాధ్యతను జమాఅత్ అధ్యక్షులు గుర్తు చేశారు.

జమాఅతె ఇస్లామీ హింద్ సభ్యులు కార్యకర్తలందరూ నాలుగు పనులు తప్పనిసరిగా చేయాలన్నారు. అవేమిటంటే - సత్య సందేశ పరిచయం (దావత్), సంస్కరణ (ఇస్లాహ్), ఆత్మశుద్ధి (తజ్‌కియ), సంఘ సేవ (ఖిద్మతె ఖల్క్).

దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు మారాలంటే ప్రజాభిప్రాయాన్ని మార్చడానికి మనమందరం ధైర్యంగా, నిలకడగా ఈ ప్రయత్నాలు కొనసాగించడం అవసరమన్నారు. సమన్యాయం కోసం ప్రయత్నించడం మనందరి బాధ్యత. "న్యాయధ్వజవాహకులుగా నిలబడండి" అనే నినాదం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఇదే.

జమాఅత్ అధ్యక్షులు ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజానికి ప్రపంచంలో దైవప్రవక్తలందరి రాక వెనుక ముఖ్యఉద్దేశ్యం సమన్యాయ స్థాపనే అన్నారు. సమన్యాయంలో న్యాయం మాత్రమే కాదు, సమానత్వం కూడా ఉంది. ఇస్లాం ధర్మశాస్త్రం చెప్పేది ఇదే. న్యాయం, సమానత్వం ఈ రెంటి మధ్య తేడా లేదు. సమాజంలో న్యాయసూత్రాల ఉల్లంఘన జరిగితే మనుషుల ధోరణులు, వైఖరులు మారిపోతాయి. ఆచరణలు మారిపోతాయి. సమతుల్యం చెడిపోతుంది. ఈ పతనాన్ని నివారించే ఏకైక మార్గం దైవం ప్రసాదించిన, ఉద్బోధించిన సమన్యాయ సూత్రాలను అమలులో పెట్టడమే. ఇస్లామీయ విధానం సమన్యాయం అయితే, ఇస్లామీయ వైఖరి సమతుల్యం అని ఆయన వివరించారు.

ప్రపంచంలో ఇప్పుడు న్యాయం అడుగంటిపోతున్న పరిస్థితిని ఆయన ప్రస్తావించారు. ఆలోచనా పరమైన అనేక అసమతుల్యాలు వ్యాపించడం వల్ల మానవజీవితం నరకతుల్యమైందని చెప్పారు. విద్వేషాన్ని ప్రచారం చేయడం, రెచ్చగొట్టడం, వైషమ్యాన్ని సాగు చేయడం జరుగుతోంది. వైరాలు ప్రోత్సహించడం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో సమన్యాయం కోసం నిలబడవలసిన అవసరం ఉందని చెప్పారు. పరిస్థితుల స్వరూపాన్ని చూసి నిరాశపడకుండా సంకల్ప బలంతో ముందుకు సాగాలని ఉద్బోధించారు. జమాఅత్ కార్యకర్తలు, సభ్యులు సమాజంలోని అన్ని వర్గాల్లో పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న సంవత్సరం 2025ను RISEగా ఆయన అభివర్ణించారు. ఇందులో R అంటే Reach Out అంటే అన్ని వర్గాల వారిని, అన్ని సముదాయాల వారిని చేరుకోవడం, ప్రజాసంబంధాలను పెద్ద స్థాయిలో పెంచుకుని సమన్యాయం కోసం పని చేయడం. ఇందులో I అంటే ఇండివిడ్యువల్ కాంట్రిబ్యూషన్. ఇది చాలా ముఖ్యమైనది. ఎవరేం చేశారని కాదు, ప్రతి వ్యక్తి తానేం చేస్తు

న్నాడో ఆలోచించుకోవాలి. తన పరంగా ఎంత వరకు పనిచేశాడో బేరీజు వేసుకోవాలి. తన వ్యక్తిత్వాన్ని సమాజానికి లాభదాయక మైనదిగా మార్చుకోవడం. ఇందులో S అంటే షిఫ్ట్ ఇన్ పబ్లిక్ ఒపీనియన్. అంటే ప్రజాభిప్రాయంలో మార్పును సాధించడం. ప్రస్తుతం వ్యాపిస్తున్న విద్వేష వాతావరణాన్ని మార్చడానికి ఇదెంతో అవసరం. సమన్యాయం, సమానత్వాల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని అవగాహనను పెంచడం ద్వారా ప్రజాభిప్రాయాన్ని నిర్మాణాత్మకంగా ప్రభావితం చేయడం. ఇక చివరి అక్షరం E అంటే ఎంగేజ్‌మెంట్. అంటే పెద్ద స్థాయిలో సామాజిక కార్యక్రమాలు, కార్యకలాపాలు, అన్ని సముదాయాలను కలుపుకుని, అన్ని వర్గాలతో కలసి నడవడం. సంబంధాలు పెంచుకోవడం. అందరినీ కలుపుకుని ముందుకు సాగడం. ఈ నాలుగు పనులను ఆచరణలో పెడుతూ రానున్న సంవత్సరం 2025 RISE సంవత్సరంగా అందరూ పూనుకోవాలని పిలుపునిచ్చారు.

పరిస్థితులు నిరాశాజనకంగా ఉన్నాయన్నది నిజమే అయినా, నిరాశకు గురికారాదని, పరిస్థితుల్లో నిర్మాణాత్మక మార్పును సాధించే ప్రయత్నాలు నిరంతరం కొనసాగించాలని చెప్పారు. దేశంలో కాని, ప్రపంచవ్యాప్తంగా కాని పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉన్నాయన్నది వాస్తవమే, కాని పరిస్థితులకు నిరుత్సాహపడడం కార్యసాధకుల లక్షణం కాదు. పరిస్థితులను మార్చుకునే ప్రయత్నాలు చేయాలని, దివ్యఖుర్‌ఆన్ బోధనలు, ప్రవక్త ప్రవచనాల వెలుగులో పరిస్థితులకు తట్టుకుని నిలబడాలని చెప్పారు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయని నిందించే బదులు పరిస్థితులను అనుకూలంగా మలచుకోడానికి, పరిస్థితుల ప్రవాహాన్ని మలుపు తిప్పడానికి ప్రయత్నించాలని ఉత్సాహం నింపారు. ప్రస్తుత కాలం పరీక్షలు, కఠినసవాళ్ళ కాలమే అయినా ప్రయత్నాలను స్థిరంగా కొనసాగించడం అవసరమన్నారు.

పలస్తీనా పరిస్థితులను ఆయన ప్రస్తావించారు. గాజాలో జరుగుతున్నది మానవసంహారం. అలాంటి పరిస్థితిలో కూడా గాజా ప్రజలు త్యాగాల చరిత్రను రాసుకుంటున్నారని చెప్పారు. గాజాలో చిన్నపిల్లలు కూడా ధ్వంసమైన తమ ఇంటి శిధిలాలపై కూర్చుని దుర్మార్గదౌర్జన్యాలపై గొంతు విప్పుతున్నారని చెప్పారు. త్యాగనిరతి, స్వేచ్ఛాకాంక్ష ఇవి ముస్లిమ్ సమాజానికి దివిటీల్లా దారి చూపుతాయని వివరించారు. దైవప్రవక్తలు, ప్రవక్త సహచరుల జీవితాలు కూడా కఠిన సవాళ్ళతో గడిచాయని, కాని వారి సంకల్ప బలం, స్థిరచిత్తం చరిత్రను మలుపు తిప్పిందని చెప్పారు.

జమాఅత్ అధ్యక్షుల ప్రసంగం ప్రస్తుతం ప్రతి ఒక్కరు అవలంబించవలసిన వైఖరి ఎలా ఉండాలో తెలియజేస్తోంది. "న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి" అనే నినాదంలోనే సమాజ శ్రేయం ఉంది. ✤


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




# న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి

- ద్వేషపూరిత అజెండాను అరికట్టడానికి అందరూ కలిసి రావాలి
- ప్రపంచంలో శాంతి, న్యాయ స్థాపనకు అన్ని దేశాలు కృషి చేయాలి
- JIH అఖిల భారత సభ్యుల సదస్సులో సమగ్ర తీర్మానాల ఆమోదం

**జాతీయ, అంతర్జాతీయ సమాజం** ఎదుర్కొంటున్న సవాళ్లపై జమాఅతె ఇస్లామీహింద్ సమగ్ర తీర్మానాలను ఆమోదించడంతో జమాతే ఇస్లామీ హింద్ (JIH) అఖిల భారత సభ్యుల సమావేశం నవంబర్ 17, ఆదివారం విజయవంతంగా ముగిసింది. 15 వేల మంది JIH సభ్యులు ఒకచోట చేరి మూడు రోజుల సమావేశాల్లో సామాజిక, విద్య, ఆర్థిక సమస్యలు, ఆధ్యాత్మికత, మతాలు, మానవ హక్కులు, విద్యాసంస్థలు, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి రంగాలపై సమగ్ర చర్చలు జరిపారు. హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జమాతే ఇస్లామీ హింద్ (JIH) అధ్యక్షుడు సయ్యద్ సాదతుల్లా హుసైనీతోపాటు జేఐహెచ్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సలీం ఇంజనీర్, జేఐహెచ్ వైస్ ప్రెసిడెంట్ మలిక్ మొతసిమ్ ఖాన్ మాట్లాడుతూ, శాంతియుత, న్యాయబద్ధ సమాజం ఏర్పాటు పట్ల సభ్యులు తమ నిబద్ధతను బలోపేతం చేయడానికి ఈ సమావేశం ఎంతగానో దోహదపడిందన్నారు.

నవంబర్ 15-17, 2024 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన జమాఅతె ఇస్లామీ హింద్ అఖిల భారత సభ్యుల సమావేశం ఆమోదించిన తీర్మానాలు క్రింది విధంగా ఉన్నాయి:

(1) మతోన్మాద శక్తుల ద్వారా కొనసాగుతున్న విధ్వంసక వ్యూహాలు మన దేశంలోని ముస్లింలకు మరింత సవాలుగా మారే ప్రమాదాలు ఉన్నాయని సమావేశం తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. మతపరమైన సంస్థలు,

# సత్యం, న్యాయం ఆధారంగా మెరుగైన ప్రపంచాన్ని నిర్మిద్దాం



## - సయ్యద్ సాదతుల్లా హుసైనీ, జమాఅత్ అధ్యక్షులు

సత్యం, న్యాయం సూత్రాలపై మెరుగైన సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో JIH సభ్యులు కృషి చేయాలని JIH అధ్యక్షులు సయ్యద్ సాదతుల్లా హుసైనీ జమాత్ కేడర్‌కు పిలుపునిచ్చారు. జమాతె ఇస్లామీ హింద్ అఖిల భారత సభ్యుల సమావేశాల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. "న్యాయం, సమానత్వ స్థాపన" అనే అంశంపై జరిగిన సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా హుస్సేనీ మాట్లాడుతూ JIH నిబంధనలకు అనుగుణంగా సేవ చేస్తామని సభ్యులు సభ్యత్వం తీసుకున్న సమయంలో చేసిన పవిత్ర ప్రతిజ్ఞను గుర్తు చేశారు. నిజమైన నిబద్ధతకు బలమైన సంకల్పం అవసరమని ఆయన వక్కాణించారు. ప్రతి సభ్యుడు తనలో విశ్వాసాన్ని నింపుకోవడమే కాకుండా దానిని తన చుట్టూ ఉన్న సమాజానికి విస్తరించాలని కోరారు.

బలమైన సామూహిక బంధాన్ని కొనసాగించడానికి సభ్యులు తమలో తాము పరస్పర మద్దతు, సహకారం, ఐక్యతను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. సభ్యులకు ఉండాల్సిన వ్యక్తిగత ప్రవర్తన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. తమ మతపరమైన బాధ్యతలను నిర్వహించడం, కుటుంబ బంధాలను పెంపొందించడం, జీవితంలోని అన్ని అంశాలలో నిజాయితీ, విశ్వాసాన్ని కలిగి ఉండటంతో వారి నిజమైన అంకితభావం మొదలవుతుందని సభ్యులకు గుర్తు చేశారు. స్వీయ-జవాబుదారీతనం, నిరంతర ఆధ్యాత్మిక పునరుజ్జీవనం, విలువల ఆధారిత సమాజాన్ని నిర్మించే లక్ష్యం శాశ్వత విజయానికి అవసరమైన నైతిక విలువలని నొక్కిచెప్పారు.

ఈ 3 రోజుల సమావేశాలలో సంస్థాగత అభివృద్ధి, సామాజిక వ్యాప్తికి కొత్త ఆలోచనలు, వ్యూహాలను అందించారు. పలువురు తాము పాటించిన ఉత్తమ సంస్థాగత పద్ధతులు, అనుభవాలను పంచుకున్నారు. దేశవ్యాప్తంగా 100 విజయవంతమైన సంఘాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను 'IDRAK తహ్రీక్ షోకేస్' అనే ప్రత్యేక ప్రదర్శనలో ప్రదర్శించారు. ఈ సమావేశ నిర్వహణకు సహకరించిన స్థానిక అధికారులు, పోలీసులకు, సదస్సు విజయవంతానికి అహోరాత్రులు శ్రమించిన 1500మంది వాలంటీర్లకు సమావేశాల నిర్వహణ కర్త అబ్దుల్ జబ్బార్ సిద్ధీఖీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రార్థనా స్థలాలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

(2) న్యాయ విచారణలు నెమ్మదిగా సాగడం, బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, అనేక ప్రభుత్వాలు అన్యాయంగా కూల్చివేతలను కొనసాగిస్తున్నాయి. వీటిని ప్రశ్నించిన గొంతులను అణిచివేస్తున్నారు. ఆల్ ఇండియా JIH సభ్యుల సమావేశం ఈ పరిస్థితిని, ద్వేషాన్ని అరికట్టకపోతే ఇది కేవలం ముస్లింలకు మాత్రమే కాకుండా యావత్ దేశానికి పెనుప్రమాదంగా మారుతుందని హెచ్చరిచ్చింది.

(3) ఈ సమావేశం కొత్త వక్ఫ్ బిల్లును తీవ్రంగా ఖండించింది. జమాత్ తన వైఖరిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (JPC) ముందు పూర్తి స్పష్టతతో సమర్పించింది. ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ బిల్లును పూర్తిగా తిరస్కరించాలని డిమాండ్ చేసింది.

(4) దేశంలో అనేకమంది అన్యాయానికి వ్యతిరేకంగా తమ గళాన్ని పెంచుతూ అణచివేతకు గురవుతున్న వారికి అండగా నిలవడం సంతృప్తిని కలిగించే విషయం. ఈ వ్యక్తులు, సత్యానికి మద్దతు ఇవ్వడానికి తమ జీవితాలను, ఆస్తులను పణంగా పెడుతున్నారు. అఖిల భారత JIH సభ్యుల సమావేశం ఈ పోరాటాలను గొప్ప గౌరవంతో అభినందిస్తోంది. ముస్లింలు పరస్పర విశ్వాసం, ప్రేమ, సహకారంతో కూడిన వాతావరణాన్ని సృష్టించే దిశగా కృషి చేస్తూ, తమ తోటి పౌరులు, ప్రభావవంతమైన వ్యక్తులతో అన్ని స్థాయిలలో తమ సంబంధాలను బలోపేతం, విస్తృతం చేసుకోవాలి.

(5) ఈ పరిస్థితులలో ఆల్ ఇండియా JIH సభ్యుల సమావేశం భారతీయ ముస్లింలకు వారి బాధ్యతలు పెరిగాయని గుర్తు చేసింది. వారు తమ విశ్వాసంలో స్థిరంగా ఉండాలి, అల్లాహ్‌ను విశ్వసించాలని, నిరాశకు లోను కాకుండా ఉండాలని చెప్పింది. వారు తమ శ్రేణులలో ఐక్యతను పెంపొందించుకోవాలి. న్యాయాన్ని అనుసరించడం, బలహీనులు, అణచివేయబడిన వారి హక్కుల

# నేను సైతం వైద్యసేవలు



## ఆల్ ఇండియా జమాఅత్ సభ్యుల సమావేశంలో క్లినికల్ ఫార్మసిస్ట్‌గా నా అనుభవం

నవంబర్ 15-17 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన జమాఅతె ఇస్లామీహింద్ ఆల్ ఇండియా సభ్యుల సమావేశంలో పాల్గొనడం నా వ్యక్తిగత, ఆధ్యాత్మిక, వృత్తిపరమైన జీవితంపై గొప్ప ప్రభావాన్ని చూపిన ఒక అద్భుతమైన అనుభవం. అర్కానే ఇజ్తెమాలో వృత్తిపరంగా సేవలందించడం మరిచిపోలేని అనుభూతిని కలిగించింది. ఈ ఇజ్తెమా వ్యక్తిగత అభివృద్ధికి, సామాజిక శ్రేయస్సుకు చక్కని వేదికగా నిలిచింది. వ్యక్తిగత బాధ్యతలు, సామాజిక కర్తవ్యాలు, నాయకత్వ లక్షణాలు ఈ కార్య క్రమంలో లోతుగా చర్చించబడ్డాయి. వ్యక్తిగతంగానూ, వృత్తిపరంగానూ నాకెంతో దోహదపడ్డాయి. కార్యకర్తగా, క్లినికల్ ఫార్మసిస్ట్‌గా, ఈ ఇజ్తెమాలో పాల్గొనడం నాలో ధార్మిక విశ్వాసం ద్విగుణీకృతమైంది. క్రమశిక్షణ, సమయపాలన, నైతికత అనే ఇస్లామిక్ విలువలు నా వృత్తిపరమైన జీవితానికి మార్గదర్శకం చేశాయి. జమాఅతె ఇస్లామీ ఉద్యమం కోసం ఎన్నో త్యాగాలు చేసిన యోధుల గురించి తెలుసుకునే అవకాశం దొరికింది. ఇస్లామీయ ఉద్యమం పట్ల సరైన దృక్పథం కల్పించింది ఈ ఇజ్తెమా.

ఈ ఇజ్తెమా కేవలం సమావేశాలకే పరిమితం కాలేదు. వ్యక్తిగత పరిచయాలు, ప్రేమ, ఆప్యాయతలు పంచుకోవడం, కలిసి భుజించడం, అంతా కలిసి నమాజులు చేయడం గొప్ప ప్రభావం వేశాయి. ఇస్లామీయ విలువలకు ప్రతిబింబంగా నిలిచాయి. నా నిజమైన ఆధ్యాత్మిక ప్రయాణానికి తొలిమెట్టుగా నిలిచింది. ఈ సమావేశంలో ఒక ఫార్మసిస్ట్‌గా ఇజ్తెమాలో వచ్చిన వారికి వైద్య సేవలందించడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. నా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని తీపి జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

డాక్టర్ అక్బర్ గారికి, డాక్టర్ ఆతిఫ్ ఇస్మాయిలీ గారికి వైద్య శిబిరంలో ఫార్మసిస్టుగా సేవలందించే అవకాశం ఇచ్చినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రత్యేకంగా డాక్టర్ జియావుద్దీన్ గారికి, మార్గదర్శనం అందించినందుకు నేను ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అనారోగ్యానికి గురైన శరీరానికి చికిత్స ఎంత అవసరమో పలు రకాల రుగ్మతలతో క్షీణిస్తున్న సమాజానికీ ఆధ్యాత్మికత అనే ఔషధం ద్వారా చికిత్స చేయాలన్న విషయాన్ని ఈ అర్కానె ఇజ్తెమా ద్వారా నేను గుర్తించాను.

**- ముహమ్మద్ ఫాతిమా జువైరియా, క్లినికల్ ఫార్మసిస్ట్, కార్యూన్, దేర్ ప్రతినిధి**

సాధన కోసం పోరాటం చేయడం ధార్మిక విధిగా భావిస్తున్నది.

(6) అల్లర్లు చేసేవారి రెచ్చగొట్టే చర్యలకు ప్రతికూలంగా స్పందించే బదులు, ముస్లింలు సామాజిక, రాజకీయ, న్యాయ రంగాలలో ప్రణాళికాబద్ధమైన ప్రయత్నాలను కొనసాగించాలి. ఈ క్లిష్ట సమయాల్లో దేశాభివృద్ధికి చురుగ్గా సహకరిస్తు, ఈ తాత్కాలిక సవాళ్లు తమ కర్తవ్యాల నుండి దృష్టి మరల్చకుండా చూసుకోవాలి.

(7) ఈ సమావేశాలు ఇస్లాం, ముస్లింలకు వ్యతిరేకంగా జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవడం అనే ముఖ్యమైన అంశంపై భారతీయ ముస్లింల దృష్టిని ఆకర్షించాయి.

(8) ప్రపంచంలోనే అత్యధిక జనాభా, చురుకైన యువ శ్రామికశక్తి, సైన్స్ టెక్నాలజీలో వేగవంతమైన పురోగతితో పాటు ఇక్కడి భిన్నత్వంలో ఏకత్వం సంక్షేమ రాజ్యానికి అవసరమైన విలువైన ఆస్తులుగా భావిస్తోంది. మన దేశ పురోగతికి సంకెళ్లు వేసే అనేక హానికరమైన పోకడలు ఇక్కడ ఉద్భవించడం దురదృష్టకరం.

(9) మతతత్వం, జాత్యహంకారం, పక్షపాతం, అణచివేత, దోపిడీ, అవినీతి దేశ శాంతియుత వాతావరణాన్ని మసక బార్చాయి. ప్రభుత్వ విధానాల కారణంగా ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి, దేశ సంపద కొద్దిమంది చేతుల్లో పోగుపడుతోంది. లెక్కలేనన్ని సవాళ్లను ఎదుర్కొంటూ జనాభాలో ఎక్కువ మంది పేదలుగా మారుతున్నారు.

(10) రాజ్యాంగబద్ధ సంస్థలు, ప్రజాస్వామ్య విలువలు వేగంగా క్షీణిస్తున్నాయి, ఇది పెరుగుతున్న నిరంకుశత్వం, వ్యక్తి పరిపాలన ధోరణికి దారి తీస్తుంది. మీడియా, విద్యా వ్యవస్థ తీవ్రవాద మతతత్వంతో ప్రభావితమవుతున్నాయి. ప్రజల మధ్య పక్షపాతాన్ని పెంపొందించడం మేధో, విద్యా రంగ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయి.

(11) సమాజంలోని ద్వేషపూరిత ఎజెండాను అరికట్టడానికి సమాజంలో విభజనను అంతం చేయడానికి కలిసి రావాలని దేశంలోని పౌరులందరికీ ఈ అఖిల భారత JIH సభ్యుల సమావేశం విజ్ఞప్తి చేస్తోంది. అన్యాయం, దోపిడీ, అసమానత, అవినీతి ఈ దేశానికి సంబంధించిన అసలైన సమస్యలు. కులం, జాతి, మతాల ఆధారంగా పౌరులను విభజించే ప్రయత్నాలను విఫలం చేయాలని, ఈ వాస్తవ సమస్యలను పరిష్కరించడానికి సమిష్టి పోరాటంలో ఐక్యం కావాలని అఖిల భారత JIH సభ్యుల సమావేశం కోరుతున్నది.

(12) దేశంలో నైతిక సంక్షోభం తీవ్రమైంది. స్త్రీల గౌరవం, మర్యాద కాపాడబడే రంగాలేవీ లేవు. నేరస్థులు చాలా అరుదుగా శిక్షను ఎదుర్కొంటున్నారు, ఇది న్యాయాన్ని అపహాస్యం చేయడమే కాకుండా తప్పు చేసేవారిని లేదా అవినీతికి దారితీసే అంశాలను ప్రోత్సహిస్తుంది. ఈ పరిస్థితి సమాజాన్ని తీవ్రమైన నైతిక పతనం వైపుకు దారి తీసేలా చేస్తున్నది. నేరాలకు పాల్పడిన వారికి శిక్షకు బదులుగా గౌరవం లభిస్తున్నది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇది దేశ నైతిక, సామాజిక పరిస్థితిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నది.

(13) ఈ సమావేశం గంభీరమైన ఈ పరిస్థితిని దేశ సమగ్ర తకు అత్యంత ప్రమాదకరంగా పరిగణిస్తున్నది. ప్రభుత్వ నాయకులు, చట్టాన్ని అమలు చేసేవారు తమ రాజకీయ ప్రయోజనాలు, పక్షపాతాలకు అతీతంగా ఎదగాలని సమావేశం కోరుతున్నది. రాజ్యాంగ సంస్థలను సంరక్షించ డానికి, దేశంలో శాంతి, న్యాయ వాతావరణాన్ని పునరుద్ధ రించడానికి చర్యలు తీసుకోవాలని, వారి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని గట్టిగా డిమాండ్ చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధమైన పాలనను అందించడంలో తమ బాధ్యతలను నిజాయితీగా నిర్వ ర్తించాలని కోరుతోంది. ద్వేషాన్ని వ్యాపింపజేసే, శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై వారు ఎంత శక్తి మంతులైనా తక్షణం చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి.

(14) గత సంవత్సరం గాజాలో ప్రారంభమైన యుద్ధం ఇప్పుడు లెబనాన్, ఇరాన్‌లకు వ్యాపించడంపై ఈ సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఇజ్రాయెల్, దాని సహాయ శక్తులను ఈ సమ్మేళనం తీవ్రంగా ఖండిస్తున్నది. పాలస్తీనాలో కొనసాగుతున్న క్రూరమైన మారణహోమం నిస్సందేహంగా ఇటీవలి చరిత్రలో మానవాళికి వ్యతి రేకంగా జరిగిన అత్యంత తీవ్రమైన నేరాలలో ఒకటి. ఈ క్రూరత్వానికి వ్యతిరేకంగా గాజా ప్రదర్శించిన ధైర్యం, దృఢత్వం ప్రశంసనీయం. ఈ దృఢత్వం ప్రపంచవ్యాప్తంగా న్యాయాన్ని ప్రేమించే వ్యక్తులు, సంస్థల దృష్టిని ఆకర్షించింది. ప్రపంచ ప్రజాభిప్రాయంలో సానుకూల మార్పును తీసుకొచ్చింది. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో మెజారిటీ మద్దతుతో ఇజ్రాయెల్‌ను దోపిడీ, జాత్యహంకార రాజ్యంగా ప్రకటించిన అంతర్జాతీయ న్యాయస్థానం చారిత్రాత్మక నిర్ణయం ఇందుకు ఉదా హరణ. ఆల్ ఇండియా JIH సభ్యుల సమ్మేళనం పాలస్తీనా ప్రజల పోరాట పటిమను మెచ్చుకుంటూ వారి విజయం కోసం ప్రార్థిస్తున్నది.

(15) పాలస్తీనియన్ల చట్టబద్ధమైన హక్కులకు మద్దతివ్వడం భారతదేశ చారిత్రక విధానంగా ఈ సమావేశం గుర్తు చేస్తోంది. ఈ వైఖరి భారత రాజ్యాంగం, భారత స్వాతంత్ర్య పోరాటంలో అంతర్లీనంగా ఉన్న సూత్రాలకు అను గుణంగా ఉంటుంది. గాజాలో మారణ హోమాన్ని అంతం చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తూ, పాలస్తీని యన్లకు మద్దతుగా తన గళాన్ని మరింత బలంగా వినిపిం చాలని ఈ సమావేశం భారత ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నది. ఇజ్రాయెల్‌కు సైనిక సహాయం, ఆయు ధాల అమ్మకాలు మన దీర్ఘకాల వలస వ్యతిరేక వైఖరికి విఘాతం కలిగిస్తున్నాయని, దీన్ని తక్షణమే నిలిపి వేయా లని విజ్ఞప్తి చేస్తున్నది.

(16) గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్య ఆసియాలో ఇటీవలి ఉద్రిక్తతలు, యుద్ధాలు కేవలం రాజకీయపరమైనవి కావని, తీవ్రమైన ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడి ఉన్నాయని స్పష్టం చేస్తోంది. ఆయుధ తయారీదారులు తమ ప్రయో జనాల కోసం విదేశీ విధానాలను ప్రభావితం చేయడం ద్వారా యుద్ధాలకు ఆజ్యం పోస్తున్నారు. ఈ పరిస్థితి ప్రపంచ శాంతికి తీవ్ర ముప్పుగా పరిణమించింది.

(17) అంతర్జాతీయ సంస్థలు రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను పక్కన పెట్టి మానవత్వం, సహజ వనరులను పరిరక్షించ డానికి ఆచరణాత్మక చర్యలు తీసుకోవాలని ఈ సమా వేశం కోరుతున్నది. యుద్ధ నేరాలకు పాల్పడిన వ్యక్తు లను న్యాయస్థానం ముందు హాజరు పరచాలని, ప్రపంచ స్థాయిలో శాంతి, న్యాయ స్థాపనకు భరోసా కల్పించాలని గట్టిగా విజ్ఞప్తి చేస్తున్నది.

(18) అణగారిన సోదరులను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఈ సమావేశాల ద్వారా JIH ముస్లిం దేశాల నాయకులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నది. వారి మానవత, మతపరమైన కర్తవ్యం ఏమిటంటే, ప్రపంచ వ్యాప్తంగా అణచివేతకు గురవుతున్న దేశాలకు మద్దతుగా వారి స్వరాన్ని పెంచాలి. అణచివేతదారులకు వ్యతి రేకంగా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని మేల్కొల్పడానికి వారి శక్తిని వినియోగించాలి. ✤

# సమ న్యాయ స్థాపనకు సంకల్పించాలి!

**జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షుడి పిలుపు**



న్యాయం, శాంతి స్థాపన కోసం ముస్లిములు ముందుకు రావాలని జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదతుల్లా హుస్సేనీ పిలుపునిచ్చారు. నవంబర్ 15-17తేదీల్లో హైదరాబాద్ పహాడీ షరీఫ్‌లోని జామియా దారుల్ హుదా గ్రౌండ్‌లో జరిగిన జమాఅతె ఇస్లామీ హింద్ అఖిల భారత సదస్సులో సంస్థ సభ్యులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ప్రస్తుత ప్రపంచంలోని నైతిక, ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలపై మాట్లాడారు. సభ్యులకు వారి బాధ్యతలను గుర్తు చేస్తూ... "శాంతియుత, న్యాయవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే, మనకు ఉన్నతమైన నైతిక స్వభావం అవసరం. ఈ సమావేశంలో జమాత్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనడం ఇస్లామీయ ఉద్యమానికి బలం చేకూర్చింది" అని అన్నారు. ప్రేరణాత్మక అనుభవాలను పంచుకోవడం, ఉన్నత లక్ష్యాల కోసం త్యాగం, క్రమశిక్షణ అలవర్చుకోవడం, మానసిక, మేధో సామరస్యాన్ని సాధించడం, సామూహిక నైతిక బలాన్ని పెంపొందించుకోవడం ఈ సమావేశాల లక్ష్యమని సయ్యద్ సాదతుల్లా హుస్సేనీ వెల్లడించారు. ఇస్లాం పట్ల సానుకూల ప్రజాభిప్రాయాన్ని ఏర్పరచడానికి గల ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ముస్లింలు, ఇతర వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ వారి మధ్య ఐక్యత ఉండాలని దాని ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. ప్రస్తుతం ఈ వర్గాలు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారని.. అయితే కఠినమైన దశలను అధిగమిస్తేనే విజయాలు సొంతమవుతాయని చెప్పారు. పరిస్థితులు ఎంతగా కఠినంగా ఉన్నా చింతించకుండా వాటిని సవాల్‌గా తీసుకొని అధిగమించాలని సూచించారు. ఈ విషయంలో అల్లాహ్ తప్పకుండా సహాయం చేస్తారన్నారు.

## వడ్డీ లేని రుణాలతో లక్షలాది పేదల జీవితాల్లో వెలుగులు

సమాజానికి జమాఅతె, దాని అనుబంధ సంస్థల కృషిని గురించి జమాతె ఇస్లామీ హింద్ జనరల్ సెక్రటరీ టి ఆరిఫ్ అలీ ఈ సమావేశంలో వివరించారు. "గత 2 సంవత్సరాలలో 8 లక్షలకు పైగా కుటుంబాలు విద్య, ఆరోగ్యం, ఆర్థికంగా లబ్ధి పొందాయి. గత 10 ఏళ్లలో 130కి పైగా మైక్రోఫైనాన్స్ సొసైటీల ద్వారా లక్షలాది కుటుంబాలకు వందల కోట్ల రూపాయలను వడ్డీ లేని రుణాల రూపంలో అందించి వారి జీవితాల్లో పెను మార్పులు తెచ్చాం" అని తెలిపారు.

వేలాది మంది అమాయకులకు న్యాయ, ఆర్థిక సహాయం అందిస్తున్నామని వెల్లడించారు.

సమావేశం మొదటి రోజు వివిధ కార్యక్రమాల్లో సాంఘిక సంక్షేమం, విద్య, దేశాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సమ్మేళనంలో 'ఇద్రాక్ తెహ్రీక్ షోకేస్' అనే ప్రత్యేక ప్రదర్శన జరిగింది. ఇందులో న్యాయ స్థాపన, సమాజ అభివృద్ధికి సంబంధించి జరుగుతున్న ప్రయత్నాలను ప్రదర్శించారు. ✤

# చారిత్రక సమావేశంలో అవకాశం దొరికింది



(సయ్యద్ అజహరుద్దీన్)



**నేను వృత్తిరీత్యా విదేశాల్లో** ఉంటున్నాను. జమాఅత్ సమావేశంలో ఎలాగైనా పాల్గొనాలన్న నా బలమైన సంకల్పానికి తోడు అల్లాహ్‌తో చేసుకున్న ప్రార్థనలు ఫలించాయి. కొన్ని నెలల తర్వాత, అనుకోకుండా ఇండియాకు వెళ్లే అవకాశం వచ్చింది. ప్రారంభంలో నేను కొద్ది రోజులు మాత్రమే ఉండాలని భావించినా, కొన్ని అనివార్య కారణాల వల్ల నా పర్యటన పొడిగించబడింది. ఈ పొడిగింపు నన్ను కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించడానికి ప్రేరేపించింది. ఈ విధంగా నేను గోవాకు చేరుకున్నాను.

కానీ, ఒక చారిత్రాత్మకమైన, అద్భుతమైన సమావేశం జరగుతుంటే నేను దాని నుంచి దూరంగా ఉన్నాననిపించింది. నేను స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియాలో (SIO) ఉన్నప్పుడు, ప్రతి ముఖ్యమైన ఈవెంట్‌లో పాల్గొనేవాణ్ని. కానీ ఇప్పుడు నేను ఏ విధమైన పాత్ర పోషించలేకపోవడం నా మనసును కలచివేసింది.

ఒక రోజు అనుకోకుండా, నన్ను ఒక వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. ఆ వెంటనే నన్ను రిఫాహ్ ఎక్స్ పోకు సహాయం చేయమని ఆహ్వానించారు. ఆ ఆహ్వానం నాకు ఎంతో ఉపశమనం ఇచ్చింది. ఈ విధంగా నేను ఈ కార్యంలో నా పాత్రను నిర్వహించగలిగాను. నేను ప్రదర్శనకు సంబంధించి మార్కెటింగ్ మెటీరియల్స్ రూపకల్పనలో చురుగ్గా పాల్గొన్నాను.

తరువాత, నేను జె.ఐ.హెచ్ తెలంగాణా స్టాల్ కోసం ఇద్రాక్ తహ్రీకి ప్రదర్శనను సిద్ధం చేయడంలో పాలుపంచుకున్నాను. ఈ అవకాశం నా జీవితంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అల్లాహ్ ప్రణాళికలు ఎప్పుడూ పరిపూర్ణంగా ఉంటాయని ఈ ప్రయాణం నాకు గుర్తుచేసింది.

## నాయకత్వాన్ని తీర్చిదిద్దడం

జమాఅత్ సభ్యుల సమావేశానికి చారిత్రక నేపథ్యం ఉంది. జమాఅత్ ఎల్లప్పుడూ సభ్యుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తుంది. ఈ కార్యక్రమం సభ్యులను సమగ్రమైన నాయకులుగా తీర్చిదిద్దడానికి కృషి చేసింది. ఆధ్యాత్మిక వికాసానికి, భావజాల పటిష్టతకు, సామాజిక-రాజకీయ చైతన్యానికి ప్రేరణగా నిలిచింది ఈ సమావేశం.

హైదరాబాద్ నగరంలో 2024 నవంబర్ 15 నుండి 17 వరకు మూడు రోజుల కార్యక్రమం ఆధ్యాత్మికత తొణికిసలాడే వాతావరణం, హృదయపూర్వక ప్రార్థనలు తమ లక్ష్యాల పునరుత్తేజంతో ముగిసింది.

ఇస్తిమా అనేక గొప్ప అనుభవాలు, భావోద్వేగ సంబంధాలు, మంచి ఆలోచనలు ప్రేరేపించే కార్యక్రమాలతో ప్రత్యేకంగా నిలిచింది.

## వాలంటీర్ నుండి రుక్న్ వరకు ప్రయాణం

2015లో హైదరాబాద్‌లో జరిగిన ఇజ్తిమాలో నేను వాలంటీర్‌గా సేవలందించిన సందర్భం ఇప్పటికీ గుర్తు. ఆ సమయంలో 12,000 - 15,000 మంది హాజరయ్యారు. కానీ ఈసారి, 2024 కార్యక్రమంలో, నేను ఒక సభ్యుడిగా (రుక్న్‌గా) పాల్గొన్నాను. ఈసారి కార్యక్రమం 20,000-25,000 మంది వరకు పాల్గొన్నారు. ఇందులో వాలంటీర్లు, కుటుంబ సభ్యులు, సందర్శకులు కూడా ఉన్నారు.

## ఫ్యామిలీతో హాజరయ్యాను..

ఈ ఇజ్తిమా నా వ్యక్తిగత భాగస్వామ్యానికి మాత్రమే పరిమితం కాలేదు. నేను నా కుటుంబాన్ని కూడా తీసుకురావాలని నిర్ణయించుకున్నాను, తహ్రీక్-ఎ-ఇస్లామీ హింద్‌లో వారిని భాగస్వాములు చేయాలనుకున్నాను. నా భార్య, అమ్మను ఒప్పించాను. నా పిల్లలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం చూసి నా హృదయం ఆనందంతో నిండిపోయింది. ఈ అనుభవం వారి జీవితాల్లో దీర్ఘకాలిక ఆధ్యాత్మిక ప్రభావాన్ని చూపాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను.

## 3. అల్-అక్సా గుమ్మటం: నిబద్ధతకు ఒక చిహ్నం

ఇజ్తిమాలోని ఒక హృద్యమైన అంశం నమాజ్ చేసే ప్రదేశం. అందంగా రూపొందించిన అల్-అక్సా గుమ్మటం ప్రతిరూపం. మస్జిద్ అల్-అక్సా కోసం జరుగుతున్న పోరాటాలు, పాలస్తీనీయులు దాని కోసం చేసిన త్యాగాలను గుర్తు చేశాయి.

## చరిత్రకు ఒక పోస్ట్-ఆఫీస్

ఇజ్తిమాలో ప్రత్యేకంగా రూపొందించినపోస్ట్-ఆఫీస్ 1981లో మౌలానా అబ్దుల్ అజీజ్ (రహ్మతుల్లాహ్ అలైహి) ఆధ్వర్యంలో జరిగిన వాది-ఎ-హుదా సమావేశాలను గుర్తు చేసింది. రాయబార కార్యాలయాలు, మంత్రిత్వ శాఖలు, గవర్నర్ల నుండి వచ్చిన లేఖలు ప్రదర్శించబడటం ద్వారా, సభ్యులను సమాజ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయమని ప్రేరేపించాయి.

ఈ కార్యక్రమం గతాన్ని, వర్తమానాన్ని కలిపి, పాల్గొన్నవారితో ప్రేరణ ఇచ్చింది. చరిత్రను గుర్తు చేసుకుంటూ సమాజ సేవా వైఖరికి పునరుత్తేజం నింపడం ప్రధాన ఉద్దేశం.

## ఆధ్యాత్మిక దృశ్యాలంకారం

ఇజ్తిమా ప్రాంగణం అందమైన జలపాతం, రంగురంగుల దీపాల ప్రకాశంతో వెలిగిపోయింది. ఈ ప్రత్యేక వాతావరణం ఆధ్యాత్మికతను, ప్రశాంతతను కలిగించింది.

బండరాళ్లపై అందమైన ఖతాత్ (క్యాలిగ్రఫీ)లో వ్రాయబడిన ఖుర్ఆన్ వాక్యాలు, అల్లాహ్‌తో సంబంధాన్ని బలపరుచుకునేలా ప్రేరేపించాయి. ప్రకృతి సౌందర్యం, దైవ ప్రేరణల కలయిక ఇజ్తిమా ప్రాంగణాన్ని మరింత పవిత్రంగా మార్చింది.

ఇజ్తిమా ఏకత్వం, సమానత్వానికి ప్రతీకగా నిలిచింది. ప్రాంతీయ, భాషా, లేదా ఆర్థిక భేదాలను పక్కన బెట్టి సాధారణ సభ్యుల నుండి జాతీయ నేతల వరకు అదే భోజనాన్ని పంచుకొని, అదే క్యూలో నిల్చొని, ఆత్మవిశ్వాసంతో నిండిన వినయం ప్రదర్శించారు.

## సాహిత్యం

ఒక భావజాల ఉద్యమం ప్రాముఖ్యత దాని సాహిత్యంపై ఆధారపడి ఉంటుంది, ఇది ఈ ఇజ్తిమాలో స్పష్టంగా కనిపించింది. ఫుడ్ స్టాల్స్ కంటే ఎక్కువ సంఖ్యలో పబ్లిషర్లు తమ పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. పురుషులు, మహిళలు, యువకులు, పిల్లల కోసం విభిన్న శ్రేణిలో పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కొత్తగా విడుదలైన పుస్తకాలు జ్ఞానసమృద్ధిని మరింతగా పెంచాయి.

ఈ ప్రయత్నానికి కీలక పాత్ర పోషించిన రచయితలు, ప్రచురణ కర్తలు, వారి బృందాలకు అభినందనందనలు. ఈ కృషి భావజాల వికాసానికి ఒక దిశనిర్దేశంగా నిలిచింది.

## తదుపరి తరం నిమగ్నం

ఇజ్తిమాలో 500 మందికి పైగా పిల్లలు పాల్గొన్నారు. చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (CIO), జే.ఐ.హెచ్ మహిళా విభాగం ప్రత్యేక సెషన్లను నిర్వహించాయి. నా పిల్లలు కూడా ఈ కార్యకలాపాల్లో భాగమవుతూ, భవిష్యత్ కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.

## జెఐహెచ్ యోధులకు ఘన నివాళి

క్యాంపస్ అంతటా ప్రదర్శించిన జమాతే ఇస్లామీ హింద్‌కు జీవం పోసిన మహనీయుల జీవితాలు, వారి సేవలు, ఈ సంస్థను ప్రభావవంతంగా నిర్మించడంలో వారి పాత్రను ప్రతిబింబించాయి. వారి త్యాగాలు ముఖ్యంగా యువతను ప్రేరేపించాయి, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మార్గాన్ని అనుసరించటానికి కట్టుబడేలా ప్రోత్సహించాయి.

## రిఫా ఎక్స్‌పో: ఔత్సాహికుల కోసం ఒక హబ్

రిఫా ఎక్స్‌పో ఇజ్తిమాలో విశేషంగా నిలిచింది, 180కి పైగా వ్యాపార



స్టాళ్లతో దేశవ్యాప్తంగా అంతర్జాతీయంగా వ్యాపారాలను విస్తరించడానికి ఒక వేదికగా మారింది. ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత వ్యాపారవేత్తలు, ప్రభావవంతమైన వ్యక్తులు, వేలాది సందర్శకులు హాజరయ్యారు, భవిష్యత్తు ఎక్స్‌పోల కోసం ఒక ప్రమాణాన్ని ఏర్పాటు చేసింది. ఈ వినూత్న ప్రయత్నానికి ముందడుగు వేసిన సయ్యద్ యూసుఫ్ అలీ ఖాన్ గారికి, రిఫా బృందానికి ప్రత్యేక అభినందనలు. వ్యాపార రంగంలో కొత్త అవకాశాలను అన్వేషించడంలో ఈ ఎక్స్‌పో ప్రధాన పాత్ర పోషించింది.

## ఇద్రాక్- తహ్రీక్ ప్రదర్శన

ఇజ్తిమాలో అత్యంత ప్రత్యేకమైన భాగం ఇద్రాక్ తహ్రీక్ ప్రదర్శన. ఇది దేశ వ్యాప్తంగా జిఐహెచ్ నిర్వహిస్తున్న 50 ప్రత్యేక ప్రాజెక్టులను హైలైట్ చేసింది. చక్కగా కూర్చిన ప్రదర్శన సంస్థ ప్రయత్నాలు, అనుబంధ సంస్థలు, వివిధ రాష్ట్రాల్లోని కార్యకలాపాలు కళ్లకుకట్టాయి.

ఈ అపూర్వమైన ప్రదర్శనకు ఆలోచనాత్మక రూపాన్ని ఇచ్చిన అతీక్ ఉర్ రెహమాన్ గారికి, నిర్వహణ బృందానికి ప్రత్యేక ప్రశంసలు. ఈ ప్రదర్శన తహ్రీక్ విజయాలను, భవిష్యత్తు కార్యాచరణలను సమాజానికి చూపించడంలో ముఖ్యమైన భాగస్వామ్యం వహించింది.

## శాంతి, సామరస్యానికి ప్రతీక

మూడు రోజుల ఇజ్తిమా ఎంతో క్రమశిక్షణగా సాగింది. ఎలాంటి తోపులాటలు, మరెలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా జరిగింది. అన్ని వేల మంది పాల్గొన్నా ట్రాఫిక్ అంతరాయాలేమీ లేవు. ట్రాఫిక్ నిర్వహణను పర్యవేక్షించడానికి ఉన్న పోలీస్ అధికారులు కూడా పుస్తకాల స్టాల్స్ వద్ద పుస్తకాలు చదవడం, ఇద్రాక్ ప్రదర్శనను తిలకించడం, ముఖ్యంగా ఏపీసీఆర్ (అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్)ను సందర్శించడం, అర్కాన్‌తో వినయపూర్వక చర్చల్లో పాల్గొనడం కనిపించింది. ✤


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




# ఓడ ప్రయాణం

- నసీరా బేగం

**అల్లాహ్** విధించిన హద్దులను కాపాడే వాని, ఆయన హద్దులను అతిక్రమించేవాని ఉపమానం ఇలా వుంది: కొంతమంది ప్రజలు ఒక ఓడ మీద లాటరీ వేసి ప్రయాణం కట్టారు. ఆ లాటరీలో కొంతమంది ప్రజలకు పైఅంతస్తులో స్థలం లభించింది. మరికొంతమందికి కింది అంతస్తులో లభించింది. క్రింద ఉన్నవారికి నీటి అవసరం కలిగినప్పుడు పై అంతస్తులో ఉన్నవారి వద్ద నుంచి వెళుతూ ఉండగా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిని అటురాకుండా అడ్డుకున్నారు. అప్పుడు క్రింది వారు ఓడకు రంధ్రం వేసి నీటిని పట్టుకున్నట్లయితే నీరు లభిస్తుందని భావించి ఓడకు రంధ్రాన్ని వేశారు. ఇదంతా చూసి పై అంతస్తు వారు వారిని ఆపలేదు. చివరకు ఆ రంధ్రం ద్వారా ఓడలోనికి నీళ్ళు చేరాయి. ఆ ఓడ కాస్తా మునిగిపోయింది. అందులో ప్రయాణిస్తున్నవారు, క్రింది వారు అందరూ ఓడతో సహా నీటిలో మునిగిపోయారు.

ఇది దైవప్రవక్త(స) గారు వివరించిన సహీహ్ బుఖారి హదీసు సారాంశం. ఇందులో మనిషి జీవితాన్ని ఒక ఓడతో పోల్చడం జరిగింది. అది సముద్రపు అలల మధ్య కుదుపులకు గురవుతూ ఉంది. ప్రతిక్షణం కలవరపాటుకు గురి చేస్తూ ఉంటుంది. ఓడలో ఉన్న ప్రతి ప్రయాణికుడు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండక పోయినట్లయితే ఎవడైనా చేసే దుష్ప్రవర్తన ద్వారా ఓడ అందరినీ ముంచేయవచ్చు.

ఈ సమాజం ఒక ఓడలాంటిది. అందులో మంచివారు, చెడ్డ వారు, తెలివైనవారు, సోమరులు రకరకాల ప్రజలు ఉంటారు. ఓడ అందరినీ ఒకే గమ్యం వైపునకు తీసుకెళుతూ ఉంటుంది. ఓడ అధినేత దాని ప్రయాణపు దిక్కులను నిర్ణయిస్తూ ఉంటాడు. కాని ఓడకు సముద్రపు అలలు, బలంగా వీచే గాలులు ప్రభావితం చేస్తూ ఉంటాయి. కొన్నిసార్లు దానికి కుడివైపు వంచితే, మరికొన్నిసార్లు ఎడమ వైపునకు వంచేస్తూ ఉంటాయి. కొన్నిసార్లు తిన్నగా నిలుచోబెడుతూ ఉంటాయి. ఇది ఒక ఉపమానం.

చాలామంది ఈ వాస్తవిక విషయం పట్ల అశ్రద్ధకు గురవుతూ ఉంటారు. వారి సమాజం, వారి జీవితం కూడా ఒక ఓడ మాదిరి గానే ఉంటుంది. ప్రతి క్షణం అది కదులుతూనే ఉంటుంది. చర్యలకు గురవుతూ ఉంటుంది. ఉద్యమిస్తూనే ఉంటుంది. కాని అకస్మాత్తుగా దానిపై ఏదైనా ఆపద విరుచుకుపడినట్లయితే ఆశ్చర్యానికి, ఆందోళనకు గురిచేస్తుంది. అటువంటప్పుడు మనిషి తీవ్రంగా ప్రభావితమవుతాడు. నిరాశా నిస్పృహలకు గురవుతాడు. దిశా నిర్దేశనం కోసం అన్నివైపులా వెతుకుతాడు.

అశ్రద్ధాపరుడు, అహంకారి అయిన మనిషి జ్ఞాపకముంచుకో వలసిన విషయం ఏమిటంటే, అతను స్థిరమైన ఒక ప్రదేశంపై స్థిరంగా నుంచొని ఉండలేదు. అతని శక్తిసామర్థ్యాలు, అతని హోదా అంతస్తులు ఏవీ స్థిరమైనవి కావు. అన్నీ అతని జీవిత

నౌకపై అల్పమైన ప్రయాణస్థితిలో అవి ప్రయాణిస్తూ ఉంటాయి. దానిపై ప్రయాణిస్తున్న అతనికి కూడా అది ఎక్కడ వరకు చేరుస్తుందో ఎక్కడ అంతమవుతుందో అతనికి తెలియదు. అలాంటప్పుడు అతనిలో అహంకారం, అశ్రద్ధ అనేవి రెండూ దరి చేరకూడదు. స్థిరంలేని, బలహీనమైనవి అయిన వాటి వెంటపడకుండా స్థిరమైన వాటి వైపునకు కలకాలం ఉండే వాటి వైపునకు వెంటనే మరలాలి. మార్గదర్శకత్వం వైపునకు, దైవ సంతోషం వైపునకు పరుగులు పెట్టాలి.

ప్రజల హృదయాలపై కమ్ముకొని ఉన్న ఈ అశ్రద్ధపు పరదాలను తొలగించటానికి దైవప్రవక్త (స) పలు విధాలుగా బోధించారు. వారిని తీర్చిదిద్దడానికి అవిరళ కృషి చేశారు.

ఒకవేళ భూస్వాములు మేమే ఈ భూమికి యజమానులము. ఈ భూమిపై జీవించేవారందరూ తమ బానిసలు అనీ, కంపెనీల యజమానులు వారి వద్ద పనిచేసే కార్మికులు తమ బానిసలని, మతాధిపతులు కూడా దేశ ప్రజలు తమ బానిసలనీ, రాజ్యాధికారులు దేశ పౌరులు తమ బానిసలనీ, దౌర్జన్యపరులు ప్రజలందరూ తమ బానిసలనీ భావించి వారిపై దౌర్జన్యాలు చేస్తే అక్రమాలకు ఒడిగడితే ఆ ఓడలో ఉన్నవారందరూ యజమాను లైనా, బానిసలైనా అందరూ పూర్తిగా మునిగిపోతారు. ఈ రోజు కూడా మన చుట్టూ ఉన్న వాతావరణంపై దృష్టిని సారిస్తే చిన్నవారైనా, పెద్దవారైనా దౌర్జన్యవంతులు వారికన్నా బలహీనమైన ప్రజలపై దౌర్జన్యానికి ఒడిగట్టిన కారణంగా ఆ జీవిత నౌకకు రంధ్రం వేసినవారవుతున్నారు. అందులో వారూ మునుగుతున్నారు. ఇతరులనూ ముంచుతున్నారు.

సాధారణంగా సమాజంలో జరిగే విషయమేమిటంటే, ఒక మనిషికి బాల్యంలో సరైన శిక్షణ లభించని కారణంగా అతను పెద్దవాడై నా అంతవాడు ఎవడు లేడని అహంకారానికి గురవుతాడు. ఆ అహంకార మదంలో అతనికి చుట్టూ ఉన్న ప్రజలు అతనికి చీమలు మాదిరిగా కనిపిస్తారు. ఇక అతను ఆ మదంలో తన చుట్టూ ఉన్న వాతావరణంలో చెడును వ్యాపిస్తూ పోతూ ఉంటాడు.

అదేవిధంగా ఒకవేళ అకస్మాత్తుగా అధిక ధనం లభించినా, అధికారం లభించినా మనిషి తనను తాను మరిచిపోతాడు. ప్రజలకు కష్టానికి, నష్టానికి గురిచేస్తాడు. సమాజంలో ఇలాంటివి ఎన్నో జరుగుతూనే ఉంటాయి. కాని సమాజంలోని ప్రజలు అలాంటి వారిని చెయ్యిపట్టి ఆపే ప్రయత్నం చెయ్యరు. అతని భయం కారణంగానో, లేదా మనకెందుకులే అనే నిర్లక్ష్యం కారణంగానో లేదా ఆ ఒకతను ఇంతపెద్ద సమాజానికి ఏమి చెయ్యగలడు? అనో ఓడలో పైఅంతస్తులో ఉన్న మాదిరిగా చూస్తూ ఊరుకుంటారు. దైవప్రవక్త(స) ప్రజలలో ఉండే ఈ ధోరణి అత్యంత ప్రమాదకరమైనదని గట్టిగా హెచ్చరించారు. ఒకవేళ ఈ ధోరణి గల ప్రజల తప్పులను దుష్కార్యాలను చెయ్యి పట్టి ఆపకపోయినట్లయితే వారు సమాజపు ఓడ మొత్తాన్ని నిలువునా ముంచివేస్తారు.

ఒకవేళ సమాజంలో చెడ్డ ప్రజలు, దౌర్జన్యపరులు ఎక్కడో ఒక్కొక్క చోట ఒక్కొక్కరే ఉంటారు. సమాజ సంస్కరణలు కూడా ఇంత పెద్ద సమాజంలో వారి విలువ ఏముందిలే అని వారి పట్ల నిర్లక్ష్య వైఖరి వహించి వారిని ఇట్టే వదిలివేస్తే వారు సమాజానికి విషం మాదిరిగా తయారవుతారు. సమాజాన్ని ఒక పెద్ద సముద్రంగా భావించినా ఆ పెద్ద సముద్రంలో కూడా ఒక్కొక్క బొట్టు విషం చేరినట్లయితే ఆ సముద్రం మొత్తం విషపూరితమైపోతుంది. అదేవిధంగా సమాజం మొత్తం విషంతో నిండిపోతుంది అనే విషయాన్ని అందరూ జ్ఞాపకం ఉంచుకోవాలి.

ఇంకా మన సమాజంలో మరొక ఆలోచన తలెత్తుతుంది. చెడు ఎక్కడైనా జరుగుతూ ఉంటే చాలామంది చూసీచూడనట్లు ఉండిపోతారు. మనకెందుకులే అని కొంతమంది, మరికొందరు నేను ఒక్కణ్ణే ఏమి చెయ్యగలుగుతాను? అని భావించి ఊరుకుంటారు.

అలా భావించటం, సంస్కరించటానికి సిద్ధం కాకపోవటం వల్ల తాత్కాలికంగా నష్టం కన్పించదు కాని అది క్రమేణా వ్యాపించి ఒక పెద్ద భాగాన్నే ఆ చెడు ఆక్రమించినప్పుడు జరగరాని ఘోరమైన నష్టం జరిగి తీరుతుంది. ఆ నష్టాన్ని ఇక్కడ ప్రస్తావించిన ఓడ ఉపమానంతో పోల్చి చూసుకుంటే చక్కగా అర్థమవుతుంది.

కనుకనే దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; ఒకవేళ ప్రజలు దౌర్జన్యపరుడిని అతను దౌర్జన్యం చేస్తూ ఉండగా చూసి అతని చెయ్యిని పట్టి ఆపకపోయినట్లయితే ప్రజలందరిపై అల్లాహ్ తరపు నుండి సామూహిక శిక్ష అవతరిస్తుంది. (తిర్మిజి)

చెడును ఆపే బాధ్యత నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. తన చుట్టూ జరుగుతున్న చెడును ఆపే బాధ్యత తనపై తప్పకుండా ఉంటుంది. దానికి తన శక్తి మేరకు అంతం చేసే కృషి చెయ్యాలి. ఒకవేళ అందరూ తన చుట్టూ ఉన్న ప్రదేశాన్ని చెడు నుంచి పరిశుభ్రం చేసే ప్రయత్నం గనక చేసినట్లయితే ప్రపంచం మొత్తం సుఖశాంతులతో నిండిపోతుంది. అందరి జీవిత నౌకలు భద్రంగా సమాజంలో తిరుగుతూ ఉంటాయి.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

16 మేము ఇదో కాస్త యాతనను తొలగిస్తాము, అంతే, మీరు ముందు చేస్తూ ఉన్నదాన్నే తిరిగి
చేస్తారు. ఏ రోజునయితే మేము పెద్ద దెబ్బ తీస్తామో ఆ రోజు, మేము మీ పట్ల ప్రతీకారం
తీర్చుకునే రోజు.[13]

17 వీరికి ముందు మేము ఫిర్ఔన్ జాతిని ఇదే పరీక్షకు గురి చేశాము. వారివద్దకు ఒక
అత్యంత సౌజన్యశీలుడయిన దైవ సందేశహరుడు వచ్చాడు,[14]

**(13వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

వారు కరవు నుండి విమోచనకై ప్రవక్త(శ్రీ (స) ని ప్రార్థించమని వేడుకున్నారు. ఈ ఉదంతం గురించి దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల సూచనలు వచ్చాయి. (చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.2, అల్ అన్ ఆమ్: ఆయత్: 42 సం.3, అల్ ఆరాఫ్: పాద సూచి 77 యూనుస్: పాదసూచికలు 15, 29 సం.5, అల్ మూ'మినూన్ : పాదసూచి 72). ఈ (ప్రస్తుత) ఆయత్‌లలోనూ సంకేతం ఆ పరిస్థితుల వైపునకే ఉందని స్పష్టంగా తెలుస్తోంది. తిరస్కారులు, "ప్రభూ! మాపై నుండి ఈ శిక్షను తొలగించు, మేము విశ్వసిస్తాము" అని పలకడం, దానికి అల్లాహ్, "వీరి అలక్ష్యం ఎక్కడ దూరమవుతుంది, వీరి వద్దకు ప్రస్ఫుటమయిన దైవ సందేశహరుడు వచ్చేశాడు, అయినప్పటికీ వీరు ఆయన వైపున శ్రద్ధ చూపలేదు, పైగా ఇతనయితే నేర్పించి పెట్టిన పిచ్చోడు అన్నారు" అని పురమాయించడం, ఆ తరువాత మళ్ళీ, "మేము ఇదో, కాస్త శిక్షను తొలగిస్తాము, కాని మీరు ముందు చేస్తూ ఉన్న దాన్నే తిరిగి చేస్తారు" అని సెలవీయడం- ఈ విషయాలన్నీ వర్తించాలంటే విషయం ప్రవక్త(శ్రీ (స) కాలానికి చెందినదే కాగలగాలి. ప్రళయానికి సమీపంలో జరిగే సంఘటన లకు వీటి వర్తింపు బుద్ధికందనిది. అందువల్ల ఈ విషయం వరకు ఇబ్ను మస్ఊద్ వ్యాఖ్యానం సరయినదిగానే అగుపిస్తోంది. కాని అందులో "పొగ" కూడా ఆ కాలంలోనే కానవచ్చిందని తెలిపే భావం ఆకలి తీవ్రత వల్ల జనం ఆకాశం వైపునకు చూస్తే అంతా పొగ అలుముకున్నట్లు కనిపించేది అని తెలిపే భాగం మటుకు సరయినది కాదని అనిపిస్తోంది. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లోని పదాల కనుగుణంగానూ లేదు, హదీసులకూ వ్యతిరేకంగా ఉంది. ఖుర్ఆన్‌లో ఆకాశం పొగ మోసుకువచ్చింది, జనులను అలుముకుంది అని చెప్పడం జరగలేదు. అక్కడ, "సరే వేచిచూడండి, ఆ రోజునకై, అప్పుడు ఆకాశం స్పష్టంగా పొగ మోసుకు వస్తుంది, అది జనులను కప్పుకుంటుంది" అని ఉంది. తరువాతి ఆయత్‌లను దృష్టిలో ఉంచుకున్నట్లయితే ఈ విధంగా సెలవిచ్చిన దాని భావం స్పష్టంగానే ద్యోతక మవుతుంది, మీరు దైవ సందేశహరుడు బోధించినా నమ్మరు, కరవు రూపంలో మిమ్మల్ని హెచ్చరించడం జరిగినా మీరు స్పృహలోకి రారు, అయితే ఇక ప్రళయం రాకనే వేచి చూడండి. అప్పుడు పూర్తిగా శాస్తి జరిగితే తప్ప మీకు బోధపడదు, సత్యం ఏమిటో, అసత్యం ఏమిటో అన్న విషయం. అందువల్ల "పొగ" విషయానికి వస్తే అది కరవు కాలానికి సంబంధించిన విషయం కానే కాదు, అది ప్రళయ చిహ్నాలలో ఒకటి అన్నదే సరయిన విషయం. ఈ విషయమే హదీసుల ద్వారానూ తెలుస్తోంది. ఆశ్చర్యకరమయిన విషయం ఏమిటంటే ప్రముఖ వ్యాఖ్యాతలలో హజ్రత్ ఇబ్ను మస్ఊద్‌ని బలపరచినవారు ఆయన గారి మాటను పూర్తిగా బలపరిచారు ఆయన మాటను కాదన్నవారు పూర్తి విషయాన్నే కాదన్నారు. నిజానికి ఆయత్‌లను, హదీసులను పరిశీలనగా చూస్తే స్పష్టంగా తేలిపోతుంది, ఏ భాగం సరయినదో, ఏది కాదో.

14. మూలంలో 'రసూలున్ కరీమ్' అన్న పదాలు ప్రయోగించ బడ్డాయి. 'కరీమ్' అనే పదం మానవుల కొరకు ప్రయోగిం చబడినట్లయితే ఉద్దేశ్యం, అతను అత్యుత్తమమయిన సౌజన్య స్వభావాలు, అత్యంత ప్రశంసనీయమయిన గుణాలు గలవాడు అన్నది. సాధారణ మంచి స్వభావాలకు ఈ పదం ప్రయోగించ బడదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

**సహీహ్ బుఖారీ** (6వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ الْمَغَازِيْ

**4. యుద్ధాల ప్రకరణం -2**
**(కితాబుల్ మగాజీ)**

# ఖైబర్ యుద్ధం

**90)** మహనీయ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ(రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) తన సైన్యంతోపాటు ఖైబర్ ముష్రిక్కులను మార్కొన్నారు. ఇరువైపుల నుండీ భీకర పోరు జరిగింది. తరువాత దైవప్రవక్త(స) తన గుడారం వైపు వచ్చారు. యూదులు కూడా తమ తమ గుడారాల వైపు తిరిగి వెళ్లారు.

అప్పుడు ప్రవక్త సహచరుల్లోని ఒక యోధుని వీరోచిత పోరాటం గురించి ఒక వ్యక్తి ప్రస్తావిస్తూ, యూదుల్లోని ఏ వ్యక్తి అతనికి ఎదురుపడినా, అతను ఆ వ్యక్తిని వెంబడించి, అతనిని వధించిగాని వదలిపెట్టడు. ఈ రోజు మా అందరి తరఫున అతను చూపిన ధైర్యం, తెగువ అనితర సాధ్యమైనది అని ఆ వ్యక్తిని కొనియాడారు. కాని దైవప్రవక్త(స) ఆ వ్యక్తి గురించి చెబుతూ, “అతను నరకానికి పోతాడు” అన్నారు. (ఆ మాట విని అందరూ ఆశ్చర్యపోయారు). అప్పుడు ఒక సహాబి, ‘నేను అతనిని వెన్నంటి ఉంటాను’ అన్నారు.

తరువాత ఆ సహాబీ ఆ యోధుని వెనుకే ఉండి, అతని కదలికల్ని జాగ్రత్తగా గమనించసాగారు. ఆ యోధుడు నిలబడిన చోటే ఆయన కూడా నిలబడేవారు. అతను పరుగెత్తిన వైపే ఆయన కూడా పరుగెత్తేవారు. చివరకు ఆ యోధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ బాధకు తట్టుకోలేక, తనకు తొందరగా మరణం రావాలని కోరుకున్నాడు. అతను తన ఖడ్గాన్ని తలక్రిందులుగా నేలలో పాతిపెట్టి ఖడ్గపు మొనపై తన ఛాతీని ఉంచి, బలంగా నొక్కాడు. ఆ విధంగా అతను ఆత్మహత్య చేసుకున్నాడు.

అప్పటి వరకూ ఆ యోధుని కదలికల్ని గమనిస్తూ ఉన్న సహాబీ దైవ ప్రవక్త(స) సన్నిధికి వచ్చి, ‘తమరు దేవుని సత్య సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను’ అని విన్నవించుకున్నారు. “ఇంతకీ ఏమయింది?” అని దైవప్రవక్త(స) విచారించగా, ఆ సహాబీ ఇలా వివరించారు: కొద్దిసేపటి క్రితమే తమరు ఫలానా వ్యక్తి గురించి, “అతడు నరకానికి పోతాడు” అని చెప్పినప్పుడు, చాలామంది మనస్తాపానికి గురయ్యారు. నేను వారిని శాంతపరుస్తూ, ఆ యోధుణ్ణి నేను పసిగడుతూ ఉంటానని మాటిచ్చాను. అందుకే నేను ఆ యోధుడి వెనుకాలే ఉండి, అతని కదలికల్ని గమనించసాగాను. ఒక దశలో ఆ యోధుడు తీవ్రంగా గాయపడి, తనను మృత్యువు తొందరగా కబళించాలన్న ఆత్రుతతో, ఖడ్గాన్ని నేలలో పాతిపెట్టి ఆ ఖడ్గం మొనపై తన ఛాతీ పడేలా తనను పడవేసుకుని, తన ప్రాణాన్ని తానే తీసుకున్నాడు అని వివరించి చెప్పారు. ఆ సందర్భంగానే ఆయన(స) ఇలా వక్కాణించారు: “ఒక మనిషి జీవితాంతం స్వర్గవాసుల ఆచరణ చేస్తాడు. కాని అతను నరకవాసి అయి ఉంటాడు. అదే విధంగా మరో మనిషి జీవితాంతం నరకవాసుల పనులు చేస్తుంటాడు. కాని వాస్తవానికి అతడు స్వర్గవాసి అయి ఉంటాడు.”[1]

90-1. ఆ వ్యక్తి పరిణామ స్వరూపం ఎలా ఉండబోతుందో దైవ ప్రవక్త(స)కు ముందుగానే ‘వహీ’ ద్వారా తెలియజేయబడింది. ఆయన(స) చెప్పినట్లే జరిగింది. ఆ యోధుడు ఆత్మహత్య చేసుకుని, హరామ్ చావు చచ్చాడు. నరకాగ్నికి ఆహుతి అయ్యాడు. అందుకే మనలో ప్రతి ఒక్కరూ మన అంతిమ పరిణామం గురించి చింతన చేస్తూ ఉండాలి. మేలైన ముగింపుకై ప్రార్థిస్తూ ఉండాలి.




- ఎస్.ఎమ్.మలిక్

**జమాఅతె ఇస్లామీ** పేరు కూడా నేను విని ఎరుగను. మౌలానా మౌదూదీని గురించి మా నాన్న ప్రస్తావించగా విన్నాను కాని ఆయన గురించి కూడా వివరాలు ఏమీ తెలియవు. మద్రాసు (నేడు చెన్నై)లో ఉద్యోగం వెలగబెడుతున్న రోజుల్లో రూమ్ కోసం వెదుక్కుంటూ తిరుగుతూ పురుసైవాక్కం ప్రాంతంలో అక్కడి మస్జిద్‌లో రూమ్ సంపాదించగలిగాను. ఆ మస్జిద్‌లో ప్రతి ఆదివారం ఇజ్తెమా జరిగేది. అందులో పాల్గొన్నాను. అదే అప్పుడు పరిచయమయింది, జమాఅత్ గురించి. అది 1963 జనవరి నెల. ఇప్పటికి సరిగ్గా 60ఏళ్ల క్రితం నేను 23వ పడిలో పడుతున్నప్పటి మాట!

జమాఅత్ లిటరేచర్ పూర్తిగా చదివాను, అప్పటికి 'తఫ్‌హీముల్ కుర్ఆన్' 4 సంపుటాలు వెలువడ్డాయి. వాటితోపాటు, ఆ తరువాత జమాఅత్ వెలువరించిన పుస్తకాలన్నీ చదివినట్టే గుర్తు. జమాఅత్ నన్ను స్వంతం చేసుకుంది. జమాఅత్ నాకు స్వంత మయిపోయింది. నా జీవన ధ్యేయంగా మారిపోయింది ఇస్లామ్ ధర్మ సంస్థాపనం. అలా ఆనాడు ధర్మ సంస్థాపనను ధ్యేయంగా మార్చుకున్న వేలాది యువతలో నేనూ ఒకణ్ణి.

## ఏమిటీ ఈ జమాఅత్?

జమాఅత్ ఓ సంస్థ కాదు, ఓ ఉద్యమం. ఉద్యమం ఏదయినా, దాన్ని దాని అంతిమ గమ్యం వైపునకు నడిపేందుకు ఓ సంఘటిత వ్యవస్థ అవసరం. జమాఅత్, ఇస్లామీయ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళే ఓ సంఘటిత శక్తి, సాధనం. ఇస్లామ్ సాధారణ భావంలో మతం కాదు, అది ఓ జీవన విధానం, జీవన వ్యవస్థ. కేవలం పూజా పురస్కారాలు, కేవలం ఆధ్యాత్మిక చింతన, ఆధ్యాత్మిక వికాసానికి జరిపే కృషి, తపోనిష్టల కార్యక్రమం కాదు ఇస్లామ్. అది సంపూర్ణ మానవ జీవన వ్యవస్థ.

ఇస్లామ్ మూలగ్రంథమయిన దివ్య కుర్ఆన్ నేరుగా మానవుడినే సంబోధిస్తుంది. మానవుడే దాని ముఖ్య విషయం కూడా. మానవ జీవన ఆశయం, నిర్దిష్ట లక్ష్యం ఏది అన్నదే దాని ప్రధాన విషయం.

మానవుడు ఈ ప్రపంచంలో జీవించడానికి ఎన్ని రూపాలు ధరిస్తాడో ఆ రూపాలన్నింటిలో అతనికి మార్గ నిర్దేశన చేసే, మార్గం సుగమం చేసే మార్గదర్శి ఇస్లామ్! మనిషి ఓ వ్యక్తిగా, భర్తగా, భార్యగా, తనయుడుగా, తనయగా, మరెన్ని రూపాల్లోనయినా

సరే మసలుకోవలసిన ఎన్నో అవసరాలు, అవకాశాలు ఎదుర్కొంటాడు, వాటన్నింటిలో అతని పాత్ర ఎలా ఉండాలో తీర్చిదిద్దుతుంది ఇస్లామ్.

ఓ పరిపాలకునిగా, పాలిత ప్రజగా, ఉద్యోగిగా, యజమానిగా, వ్యాపారిగా- అన్ని విధాలుగా మనిషికి దారి చూపుతుంది ఇస్లామ్. సామూహిక జీవితంలోని అన్ని రంగాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎలా మసలుకోవాలో నిర్దేశిస్తుంది ఇస్లామ్. ఇంతకీ ఇది ఏదో మానవ కల్పనల సిద్ధాంతాల ఆధారంగా కాదు, విశ్వకర్త, స్వామి, ప్రభువు, దైవం పక్షాన అందజేయబడిన మార్గ బోధనల ఆధారంగా! ఇస్లామ్ ధర్మం పునాదిగా!!

ఈ ధార్మిక భావన ప్రాతిపదికన ఏర్పడుతుంది ఇస్లామ్. అదే జమాఅత్ సందేశం. మనిషి తన వ్యక్తిగత జీవితంలోనూ సామూహిక జీవితంలోనూ ఇస్లామ్‌ను తన జీవన విధానంగా స్వీకరించాలన్నది, అదే మనిషికి సముచితమయిన, సవ్యమయిన, విజయవంతమయిన, ఇహపరాలలో సఫలత ప్రసాదించే ఏకైక మార్గమన్నది జమాఅత్ సందేశం.

ఇక జమాఅత్‌తో నా జీవితం ముడిపడి పోయింది. జమాఅత్ పిలుపు మేరకు నేను ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో దాదాపు మూడేళ్లు అమీరె జమాఅత్ (అధ్యక్షులు), కయ్యిమె జమాఅత్ (ప్రధాన కార్యదర్శి) ఉభయులకు సెక్రెటరీగా పనిచేస్తూ జమాఅత్‌ను లోనుంచి కూడా చూసే అనుభవం గడించాను. జమాఅత్ నాయకత్వం ఎంతటి మహానుభావుల చేతుల్లో, ఎంతటి త్యాగధనుల ఆధ్వర్యంలో, ఎంతటి సహనమూర్తుల దృష్టి ఛాయల్లో ప్రవర్ధమానం అవుతున్నదో గమనించే భాగ్యం కలిగింది. వారిలో ఒక్కొక్కరి వ్యక్తిగత జీవితాన్ని వివరించుకుంటూ పోతే ఒక్కొక్క గ్రంథం తయారవుతుంది.

మౌలానా అబుల్ లైస్ ఇస్లాహీ, మౌలానా ముహమ్మద్ యూసుఫ్, మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహీ, మౌలానా ముహమ్మద్ ముస్లిమ్ (దావత్ దినపత్రిక సంపాదకులు), మౌలానా ముహమ్మద్ యూసుఫ్ సిద్దీకీ (రేడియన్స్ వీక్లీ సంపాదకులు), మౌలానా అఫ్జల్ హుసైన్, మౌలానా ముహమ్మద్ షఫీ మూనిస్, మౌలానా సిరాజుల్ హసన్, మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమరీ, డాక్టర్ నిజాతుల్లా సిద్దీకీ, డాక్టర్ ఫజ్లుర్రహ్మాన్ ఫరీదీ, జనాబ్ అబూ సలీమ్ అబ్దుల్ హై, మౌలానా ఇనాముర్రహ్మాన్ ఖాన్, మౌలానా షేఖ్ అబ్దుల్లా ఉమరీ, మౌలానా అబ్దుల్ అజీజ్, మౌలానా అబ్దుర్రజాక్ లతీఫీ, టి.కె. అబ్దుల్లాహ్, కె.సె.అబ్దుల్లాహ్, మట్టేకార్ జమీల్ అహ్మద్... వీరంతా తొలినాడు జమాఅత్‌కు లభించిన ఆణిముత్యాలు! నా అదృష్టం కొద్దీ ఈ మహనీయులందరి సాంగత్యంలో నన్ను నేను సంస్కరించుకునే, చక్కదిద్దుకునే అవకాశం ప్రాప్తమయింది. ఎవరయినా సరే, ఎంత ప్రాప్తమయినా తమ పాత్రకు, తమ పాత్రతకు తగినంతనే పొందుపరచుకోగలరు!!

నేడు జమాఅతె ఇస్లామీ హింద్ తన ఏడు దశాబ్దాల కృషిని నెమరు వేసుకుంటోంది.

కాలం, వ్యక్తుల జీవితంలోనయినా, సంస్థల మనుగడలోనయినా మైలురాయిగా దోహదపడుతుంది. తాము అనుకున్నదేమిటో, సాధించినదేమిటో, ఇంకా సాధించవలసినదేమిటో వెనక్కి తిరిగి చూసుకునేందుకు, ముమ్ముందు చేయవలసిన కార్యక్రమాన్ని నిర్ణయించుకునేందుకు ఉపకరిస్తుంది. నేడు జమాఅత్ కూడా అటువంటి దశలో నిలబడి చూసుకోవలసిన అవసరం ఎంతయినా ఉంది.

జమాఅతె ఇస్లామీ స్థాపన దేశ స్వాతంత్ర్యం కన్నా ఏడేళ్లు ముందే జరిగినా స్వాతంత్ర్యం, దేశ విభజనగా పరిణమించింది. దరిమిలా జమాఅత్ కూడా విభజనకు గురయింది. మన దేశంలో జమాఅత్ 1948 ఏప్రిల్ 16న 'జమాఅతె ఇస్లామీ హింద్'గా పునస్థాపన చేసుకుంది. ఆ విధంగా జమాఅతె ఇస్లామీ హింద్ ఈ సంవత్సరం (2022) తన 75వ స్థాపనా దినాన్ని ఎదురుచూడబోతోంది.

## జమాఅతె ఇస్లామీ హింద్ స్థాపన

భారతదేశ ప్రజలు, దేశ విభజన కారణంగా, గడ్డుకాలాన్ని అనుభవిస్తున్న రోజుల్లో జమాఅత్ స్థాపన జరిగింది. దేశం ఉత్తర భాగాన మతకలహాల మహమ్మారి ఎడతెరిపి లేకుండా జనాన్ని పీడిస్తున్న కాలమది. భారతదేశంలోనే తమ భవిష్యత్తును దర్శించుకున్న ముస్లిమ్ సముదాయ ప్రజలు, ఆ మత కలహాలలో పూర్తిగా కుదిపివేయబడ్డారు. ఆ విపత్కర కాలంలో ఇస్లామ్‌నే తమ ధర్మంగా, భారతదేశాన్నే తమ స్వదేశంగా ఎంచుకుని జీవిస్తున్న వారికి తాము ముస్లిములమని ప్రకటించుకోవడం కూడా దుర్భరమయిన రోజులవి.

ఆ కాలంలో ముస్లిమ్ సముదాయాన్ని ఓ ప్రక్కన మతకలహాల ఆగడాల నుండి ఆదుకుని, వారి భౌతిక, మానసిక, సాముదాయిక గాయాలను తుడిచి, వారిలో ధైర్యం సడలకుండా తమ ధర్మం పైన నిలకడ చూపగలందులకు సహన స్థయిర్యాలతో పరిస్థితులను ఎదుర్కొనేలా సహాయపడుతూనే మరో ప్రక్కన సోదర దేశ వాసులలో ఇస్లామ్, ముస్లిముల గురించి వ్యాపించిన అపార్థాల మబ్బుల్ని తొలగించే కార్యక్రమం చేపట్టవలసిన అగత్యమూ ఏర్పడింది జమాఅత్‌కు.

ఆ రోజుల్లోనూ మన దేశంలో ఉండిపోయిన జమాఅత్ సభ్యులను సమీకరించుకుని, వారిని పునస్సంఘటిత పరిచి కార్యచరణకు సన్నద్ధపరచటం ఆనాటి నాయకులపైన పడిన కార్యభారం. ఆ సందర్భంలో ఎన్నికయిన ప్రథమ అమీర్ లేదా అధ్యక్షులు, మౌలానా అబుల్ లైస్ ఇస్లాహీ, నద్వీ. ఆయన 1948 నుండి 1972 వరకు ప్రతి నాలుగేళ్ళ కార్యవ్యవధిలో అధ్యక్షులుగా ఎన్నికవుతూ వచ్చారు. అలాగే తొలి కయ్యిమ్ లేదా సెక్రెటరీ జనరల్ ముహమ్మద్ యూసుఫ్ కూడా 1948 నుంచి 1972 వరకు సెక్రెటరీ జనరల్‌గా వ్యవహరిస్తూ వచ్చారు.

## సమాజ సంస్కరణ

జమాఅత్ దాని పునస్థాపన తరువాత కళ్ళు తెరవగానే ఎదురయిన సమస్య మతకలహాలు. మతతత్వం ఎవరిదయినా సమాజానికి హానికరమయినదని ప్రజలకు అవగాహన కలిగించటం జమాఅత్ చేపట్టిన తొలి కార్యక్రమం. అలాగే పాశ్చాత్య సంస్కృతి విజృంభణ వల్ల ప్రజల్లో పాదుకుపోతున్న ధర్మ విహీనతా భావనను తొలగించడం, ముఖ్యంగా విద్యావంతులయిన ముస్లిముల్లో తమ ధర్మం పట్ల సరయిన అవగాహన, నమ్మకం కలిగించటంతోపాటు వారికి దాని అనుసరణ ఎడలనూ ప్రేరణ, జాగృతం చెయ్యడం జమాఅత్ చేపట్టిన ముఖ్య కార్యక్రమం. ముస్లిమ్ సముదాయం సుసంఘటితమయి వారు సాముదాయిక పునర్నిర్మాణానికి ఉత్తేజితులయ్యేలా, వారు ఇస్లామ్ సందేశ వాహకులయ్యేలా కృషి సలపడం జమాఅత్ చేసిన మరో ప్రయత్నం.

ముస్లిమ్ సముదాయంలో ధార్మిక విద్యను సర్వసామాన్యం చేసేందుకు పాఠశాలలు, అధ్యాపకులను సన్నద్ధం చేసి దేశంలో నలుమూలల, సాధ్యమయిన ప్రతిచోట విద్యా సముపార్జన ఆకాంక్షను ప్రేరేపించి అవసరమయినన్ని పాఠశాలలు తెరవడం జరిగింది. అప్పుడప్పుడే నవ నిర్మాణ దశను దాటుతున్న ముస్లిమ్ సముదాయంలో విద్యాజాగృతి కొరకు గట్టి ప్రయత్నాలు జరిగాయి. దీనంతటికి జమాఅత్‌కు ఎనలేని మానవ సంపాదనా సంపత్తి ఎంతో అవసరం. ఇస్లామ్ ధ్వజవాహకులయిన కార్యకర్తల శీల నిర్మాణం తొలినాటి నుంచి జమాఅత్ ప్రాధాన్యతల్లో ఉన్న అంశమే. అయితే ప్రథమంగా కుర్‌ఆన్ అవగాహనా కృషి సమాజంలో ఏ మేరకు సామాన్యమయితే ఆ మేరకు నిజమయిన కార్యకర్తలు లభ్యమవుతారన్నది జమాఅత్ నమ్మకం. ఆ విధంగానే కుర్‌ఆన్ అవగాహన పట్ల జాగృతి సముదాయంలో కలిగించే ప్రయత్నాలు ముమ్మరం చెయ్యడం జరిగింది.

## సముదాయం ద్వారా...

దేశంలో విభజన తెచ్చిన ఇక్కట్ల వల్లనయితేనేమి, మతతత్వం విజృంభణ వల్లనయితేనేమి ముస్లిమ్ సముదాయంలో నిరాశా నిస్పృహల వాతావరణం జనించింది. ఫలితంగా వారి ఆలోచనల్లో నకారాత్మకత, ఆత్మన్యూనత భావాలు చోటు చేసుకున్నాయి. వారిలో నైరాశ్యం పోగొట్టి సకారాత్మక ధోరణులు జనింపజేయడం అత్యంతావశ్యకమయింది. వారు, కేవలం తమ కొరకు మాత్రమే కాక దేశం కొరకు, సముదాయం కొరకు కృషి సలిపే వారుగా, దేశ సేవ, కుల, మత, జాతి, వర్గ విచక్షణా రహితంగా జరిపే నిస్వార్థ సేవకులుగా వారిని మలిచే మహత్కార్యం జమాఅత్ చేయగలిగింది.

జమాఅత్‌కు అవసరమయిన కార్యకర్తలయినా నాయకులయినా ముస్లిమ్ సముదాయం ద్వారానే అత్యధికంగా ప్రాప్తమయ్యారు. వారిని పైన తెలిపిన విధంగా మలిచేందుకు యువతను, మహిళలను, విద్యార్థులను, విద్యార్థినులను ఈ ఉద్యమానికి చేరువ చేసేందుకు, ఎస్ఐఓ, జీఐఓ, మహిళా విభాగం, యువత విభాగం, సంఘ సేవా సంస్థలు, మానవ హక్కుల కొరకు కృషి సలిపే సంఘాలు, ఆర్థిక, వృత్తి సేవా సంస్థలు- ఇత్యాదివి


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

నెలకొలపడమే కాక సమాజంలోని- ఇతర విభాగాలకు సంబంధిం చిన వారిని ఆయా విభాగాల సంఘటనల ద్వారా ఆకర్షిస్తూ జమాఅత్ సామాజిక సేవలనందిస్తోంది.

చిందువందుగా జీవిస్తున్న సముదాయంలో సుసంఘటితంగా జీవించాలన్న స్పృహ కలిగించడంతోపాటు తమ వ్యవహారాలు సామూహికంగా పరిష్కరించుకోవాలన్న జాగృతి తెచ్చే ప్రయత్నం జరిగింది. సంస్థలను ఓ నిర్దిష్ట నియమావళి ద్వారా, అలాగే సంస్థల్ని ప్రజాస్వామిక విధానం ద్వారా నడపాలన్న భావనను పటిష్టం చేసేందుకు ప్రయత్నం జరిగింది. సంస్థల్లో సలహా సంప్రతింపులతో సామూహిక నిర్ణయాలు తీసుకునే విధానాన్ని అలవర్చడం కూడా జరిగింది.

విద్యా విధానంలో, ధార్మిక విద్య, ప్రాపంచిక విద్య అన్న వేర్పాటును తుడిచిపెట్టడంతోపాటు ధార్మిక బోధనల వెలుగులో ఆధునిక విద్య పట్ల మక్కువ పెంచడం ఓ ప్రముఖ మలుపు. ఆర్థిక రంగంలో వడ్డీలేని రుణాల సంస్థలు నెలకొల్పడం, రాజకీయాల్లో నైతిక విలువల ప్రాముఖ్యతను ఎత్తి చూపడం, సోదర దేశవాసులతో సత్సంబంధాలను ఏర్పరచుకునే ప్రవృత్తి జనింపజేయడం ఇత్యాది అనేక ప్రాథమికతల్ని జమాఅత్ కార్యకలాపాల ద్వారా సూచించడం జరిగింది.

### నిజ మత భావన ప్రచారం

సామూహిక వ్యవహారాల నుంచి మతాన్నే తుడిచిపెట్టడం ద్వారా మనం కోల్పోయినదేమిటో దేశ ప్రజలకు ఎరుక పరచడం, సామాజిక వ్యవహారాల్లో మతం నిజ భావన ద్వారా దాని నిర్మాణాత్మక పాత్రను ఎత్తిచూపి, మతాన్ని కాదు, మతతత్వాన్ని రూపుమాపాలన్న విషయాన్ని బలపరచడం జరిగింది. అలాగే విభిన్న మతావలంబీకుల మధ్య సంప్రదింపులు, చర్చల ద్వారా పరస్పర సహకార వాతావరణం సృజించడం జరిగింది. “ఫోరమ్ ఫర్ డెమోక్రసీ అండ్ కమ్యూనల్ ఎమిటీ” (FDCA), ధార్మిక జనమోర్చా, సద్భావనా మంచ్ తదితర సంఘాల ద్వారా మత ప్రధానమయిన భారతదేశంలో సత్సమాజ నిర్మాణం కొరకు కృషి జేయడం జరిగింది. తొలి నుంచి కూడా జమాఅత్, అన్ని చోట్లా సామాజిక సమస్యలపై బహిరంగ సభలు, సింపోజియంలు, సెమినార్‌లు నిర్వహించి ప్రజలకు చేరువయ్యే ప్రయత్నాలు జరిపింది.

దేశ ప్రజల్లో ఇస్లామ్, ముస్లిములను గురించి ఏర్పడిన అపార్థా లను తొలగించి ఇస్లామ్ పట్ల సరయిన అవగాహన కలిగించేం దుకు భారతదేశంలోని ప్రముఖ భాషలన్నింటిలో దివ్య ఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్(స) సచ్చరిత, ప్రవక్త ప్రవచనాలయిన హదీసులు ఇంకా ఇస్లామ్ అవగాహనకు దోహదపడే సాహిత్యం అనువదించి ప్రజల్లో వ్యాపింపజెయ్యడం జరిగింది.

అదేవిధంగా పరస్పర అవగాహనా మాధ్యమాల ప్రాముఖ్యత తెలిసిన జమాఅత్, ప్రముఖ దేశ భాషల్లో మాస, వార పత్రికల్ని వెలువరించి సామాన్య ప్రజల వరకు చేర్చే ప్రయత్నాలు జరిపింది. కొన్ని ప్రాంతాల్లో దినపత్రికల్ని సయితమూ ప్రచురిస్తోంది. దేశంలో కొన్ని చోట్ల టీవీ ఛానెల్ ద్వారా కూడా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తోంది.

### చేయవలసింది...

ఎంతజేసినా, పలు మతాలు, జాతులు, భాషలు, సంస్కృతులకు ఆలవాలమయి ఉపఖండం అనబడుతున్న మన దేశంలో ఇంకా ఎంతో చేయవలసి ఉంటుంది. నేడు ముఖ్యంగా దేశంలో ఒక్కొక్క వ్యక్తి వరకు చేరవలసిన అవసరం ఉంది. సోదర దేశ వాసులతో జమాఅత్ కార్యకర్తలు సత్సంబంధాలను ముమ్మరంగా పెంపొందించుకోవలసిన అవసరమూ ఉంది. మత విద్వేషాన్ని పారద్రోలేందుకు కలసికట్టుగా కృషి సలపవలసి ఉంది.

జ్ఞానం సర్వసామాన్యమయిన ఈ ఆధునిక యుగంలోనూ మన దేశంలో ఇంకా కొన్ని వర్గాలకు విద్యా గంధం సోకలేదన్నది వాస్తవం. విద్య ప్రాథమిక మానవ హక్కుల్లో ఒకటి. జమాఅత్ అటువంటి వారిని చేరదీసి జ్ఞాన సంపన్నులుగా తీర్చిదిద్దే బాధ్యత వహించవలసిన అవసరం ఎంతయినా ఉంది. పలు రంగాలలో ఎంతో సంపన్నమయిన మన దేశంలో ఆర్థికంగా ఇంకా వెనుక బడిన వర్గాలు ఉండటం ఎంతయినా విచారకరమయిన విషయం. అటువంటి వారిని ఆదుకుని ఆర్థికంగా, సామాజికంగా లేవనెత్తడం కూడా అవసరమే. జమాఅత్ ఈ సేవను సయితం చేపట్టవలసి ఉంటుంది.

నేటి పరిస్థితుల్లో మరో విషయం కూడా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల్లో సహిష్ణుతా భావం రానురాను కొరవడు తోంది. ముస్లిముల పట్ల సోదర దేశవాసులలో విద్వేషాన్ని నూరి పోస్తున్న శక్తుల బెడద తీవ్రంగా వ్యాపిస్తోంది. దీనికి విరుగుడుగా జమాఅత్ కార్యకర్తలు, సోదరదేశవాసులతో సోదర సంబంధాలను పెంపొందిచుకుని ముస్లిముల పట్ల సహిష్ణుతా భావం పెంపొం దించడంతోపాటు ఇస్లామ్ గురించి కూడా విరివిగా సదవగాహన కలిగించడం తమ ప్రథమ కార్యక్రమంగా చేపట్టవలసి ఉంటుంది.

ఇప్పటికే నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను సవ్యంగా పాటిస్తూ పైన సూచించిన అంశాలను సయితం దృష్టిలో ఉంచుకున్నట్లయితే దేశ స్వరూపం మారే అవకాశం ఉందని ఆశిస్తున్నాము. ❖




**- సల్మాన్ హైదర్**

**గత ఏడున్నర దశాబ్దాలుగా, సివిల్ సర్వీస్ పరీక్షలలో దేశంలోని అతి పెద్ద మైనారిటీ వర్గం అయిన ముస్లింల భాగస్వామ్యం, వారి విజయాల శాతం సంతృప్తికరంగా లేవు అని కొత్త పుస్తకం 'ముస్లిమ్స్ ఇన్ ఇండియా - ఫేక్ నేరేటివ్స్ వర్సెస్ గ్రౌండ్ రియాలిటీస్** (Muslims in India- Fake Narratives versus Ground Realities)**లో పొందుపరచిన గణాంకాల ప్రకారం తెలుస్తుంది.**

భారత దేశంలో ప్రతి సంవత్సరం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) నిర్వహించే CSEలో ఎంపికైన అభ్యర్థులు ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లో ప్రతిష్టాత్మకమైన స్థానాలకు ఎంపిక అవుతారు.

ప్రతి సంవత్సరం, 10 లక్షల కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ప్రిలిమ్స్‌కు హాజరవుతారు, వీరిలో ఒక శాతం లేదా 10,000 మంది మెయిన్స్‌కు అర్హత సాధిస్తారు. ఇందులో దాదాపు 3,000 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచి ఎంపిక చేస్తారు. ప్రతి సంవత్సరం తుది ఎంపికల సంఖ్య దాదాపు 1,000 ఉంటుంది.

భారతదేశంలో ఆంగ్లేయుల కాలంలో అక్టోబర్ 1926లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయబడింది. ఇది లండన్‌లో మొదటిసారిగా ఇండియన్ సివిల్ సర్వీస్ (ICS) పరీక్షలను నిర్వహించింది. 1869 వరకు, 16 మంది భారతీయులు ICS పరీక్షలకు హాజరయ్యారు, కానీ ఒకరు మాత్రమే విజయం సాధించగలిగారు. 1914నాటి ఐసిఎస్ అధికారుల్లో కేవలం ఐదు శాతం మంది మాత్రమే భారతీయులు.

1855, 1899 మధ్య, 14 మంది ICS అధికారులు ఉన్నారు, ఇందులో కాన్పూర్‌కు చెందిన ఒక ముస్లిం ఇండియన్ పొలిటికల్ సర్వీస్ అబ్దుల్లా యూసుఫ్ అలీ (ఏడవ ర్యాంక్ హోల్డర్) 1914లో రాజీనామా చేశారు. 1900 నుండి 1947 వరకు, మొత్తం 40 మంది ICS అధికారులలో మొహమ్మద్ సాలెహ్ అక్బర్ హైదరీ ఒక్కరే ముస్లిం.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, 980 మంది ICS అధికారులలో

101 మంది ముస్లింలు, 25 మంది భారతీయ క్రైస్తవులు, 13 మంది పార్సీలు, 10 మంది సిక్కులు ఉన్నారు.

స్వాతంత్ర్యం తరువాత, ICS స్థానంలో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (IAS) వచ్చింది. IAS అధికారుల మొదటి బ్యాచ్ 1948లో రిక్రూట్ చేయబడింది. ICS అధికారుల సంఖ్య 242గా ఉంది.

1958లో కేవలం ఇద్దరు ముస్లింలు మాత్రమే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు, (1993-94లో భారతదేశపు మొట్టమొదటి, ఏకైక ముస్లిం క్యాబినెట్ సెక్రటరీ అయిన జాఫర్ సైఫుల్లాతో సహా).

యూపీఎస్సీలో చైర్మన్లు, సభ్యులుగా ముస్లింల ప్రాతినిధ్యం అల్పం. మొత్తం 32 మంది ఛైర్‌పర్సన్‌లలో ముగ్గురు మాత్రమే ముస్లింలు- డాక్టర్ ఎఆర్ కిద్వాయ్ (1973-79), జెఎమ్ ఖురేషి (1996-98), డాక్టర్ ఎస్ఆర్ హాషిమ్ (2005-06).

UPSC సభ్యులలో 16 మంది ఇప్పటి వరకు ముస్లింలు., 2027- 2030 మధ్య పదవీకాలం ముగియనున్న ప్రస్తుతం ఉన్న ఆరుగురు సభ్యులలో ముస్లిం లేరు.

యూపీఎస్సీ 162 మంది అధికారులలో పరీక్షల డైరెక్టర్ ఇమ్రాన్ ఫరీద్‌తో సహా నలుగురు ముస్లింలు మాత్రమే ఉన్నారు.

జస్టిస్ సచార్ కమిటీ, మొత్తం 8,827 మంది అధికారుల (IAS, IPS, IFS) పౌర సేవల జాబితాను విశ్లేషించిన తర్వాత, వారిలో ముస్లింలు కేవలం 3.2 శాతం మాత్రమే ఉన్నట్లు గుర్తించారు.

2006లో, ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో ముస్లింలు కేవలం 2.2 శాతం మాత్రమే ఉన్నారు. మొత్తం 4,790 మంది ముస్లిం ఐఏఎస్ అధికారులు 108 మంది ఉన్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం ముస్లింల జనాభా 13.43 శాతం. ఆ ప్రమాణం ప్రకారం, దేశంలో ప్రతి 5.73 లక్షల మంది ముస్లింలలో ఒక IAS లేదా IPS అధికారి ఉన్నారు, ప్రతి 1.08 లక్షల మంది ముస్లిమేతరులలో ఒకరు IAS లేదా IPS అధికారి ఉన్నారు.

జూన్ 2014లో దేశంలోని 8,417 మంది IAS, IPS అధికారులలో ముస్లింలు 3.46 శాతం ఉన్నారని వెల్లడైంది.

మొదట్లో దేశంలోని ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది ముస్లిం ఐఏఎస్ అధికారులు ఎంపిక కాగా ఈ మధ్య అనగా 2000 నుంచి జమ్మూ కాశ్మీర్, కేరళ ఎక్కువ మంది ముస్లిం అధికారులు ఎంపిక అవుతున్నారు.

జనవరి 2014 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ప్రకారం ముస్లిం అభ్యర్థుల తక్కువ స్థాయి భాగస్వామ్యమే తక్కువ ప్రాతినిధ్యానికి మూల కారణం

1958- 2021 మధ్య కాలంలో 686 మంది ముస్లిం అభ్యర్థులు CSEకు తుది జాబితాలో చోటు పొందారు..

1971, 1972, 1975, 1976 సంవత్సరాల్లో CSE జాబితాలలో ముస్లింలు ఎవరూ లేరు.

1973, 1981, 1983, 1998లో ఒక్క ముస్లిం మాత్రమే జాబితాలో చేరగలిగారు.

1972 నుండి 2023 వరకు, CSEలో 54 మంది టాపర్‌లు ఉన్నారు. వారిలో ముగ్గురు ముస్లిములు. టాపర్ జాబితాలో మొదటి ముస్లిం 1978లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన జావేద్ ఉస్మానీ. 1987లో బీహార్‌కు చెందిన అమీర్ సుభానీ టాపర్స్ క్లబ్‌లో చోటు దక్కించుకున్నాడు. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన షా ఫైసల్ 22 సంవత్సరాల తరువాత 2009లో టాపర్ అయినాడు.

1951 నుండి 2020 వరకు ఏడు దశాబ్దాలలో, మొత్తం 11,569 IASలలో 411 మంది ముస్లింలు.

1948లో ప్రారంభమైన IPSకి మొత్తం 4,344 మందిలో ముస్లింలు 151 మంది ఉన్నారు.

2023లో మూడు సర్వీసుల్లోని (IAS, IPS, IFS) 11,959 మంది అధికారుల్లో 366 మంది ముస్లింలు ఉన్నారు.

యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# వక్ఫ్ ప్రాపర్టీ అల్లాహ్ ఆస్తి



- సయ్యిద్ సాదతుల్లా హుసైనీ

అనువాదం : ఆలియా

## (విజయవాడలో 'వక్ఫ్ పరిరక్షణ' సదస్సులో చేసిన ప్రసంగం)

(గత సంచిక తరువాయి)

పెద్దలారా, మిత్రులారా! ఇక్కడ ఎన్నెన్నో మంచి విషయాలు ప్రస్తావించబడ్డాయి. ఆంధ్రప్రదేశ్లో రూలింగ్ పార్టీ అయిన తెలుగుదేశం, ప్రతిపక్ష పార్టీ ఇద్దరూ ఈ బిల్లు వలన కలిగే నష్టాలను మన ముందు ఉంచడంతో నాకు చాలా సంతోషం కలిగింది. మేము ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాము, ఎందుకంటే వారు ఈ బిల్లును పాస్ కాకుండా చేశారు. JPC జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ట్రాన్స్ఫర్ చేశారు. ఇక్కడ ఏ విషయాలయితే ప్రసంగాలలో వచ్చాయో వాటి ప్రకారంగా ముఖ్యమంత్రి గారు ఇదే విల్ పవర్, ఇదే రాజ్యాంగ స్పిరిట్ ను మరోసారి ప్రదర్శిస్తారని నమ్ముతున్నాను. ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదించరని నమ్ముతున్నాము. ఈ బిల్లు ఆంధ్రప్రదేశ్, బీహార్ ప్రజల న్యాయస్థానాల్లో ఉంది. ఒకవేళ మీరంతా ఏకమై మీ రాజకీయ నాయకుల వరకు మీ సమాచారాన్ని చేరవేస్తే, అల్హమ్దులిల్లాహ్ చేర వేస్తున్నారు కూడా. ఒకవేళ ధైర్యంతో ముందుకు వస్తే, తమ బాధ్యతగా భావించి ముందుకు వస్తే ఇన్షాఅల్లాహ్ ఈ బిల్లు ఆమోదించబడదు. పార్లమెంటులో తిరస్కరించబడుతుంది. ఇక్కడున్న ప్రజానీకం మొత్తం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారితో, తెలుగుదేశం పార్టీతో, JPCలో ఉన్న తెలుగుదేశం ఎంపీలతో, మీరు జెపిసిలో, పార్లమెంటులో ఈ బిల్లును తిరస్కరించండి, ఈ బిల్లును ఆమోదించకుండా చేయండి అని ప్రతి ఒక్కరూ తమ అభ్యర్థనను వెలిబుచ్చుతున్నారు. ఇందులోని ప్రతి నిబంధనను ఆమోదించ బడకుండా చేయండి. ఈ బిల్లులోని ఏ ఒక్క నిబంధన కూడా స్వీకార యోగ్యం కాదు.

గౌరవనీయ శ్రోతలారా! ఈ సందర్భంలో మన బాధ్యతలు ఏమిటి అనే అంశమై 4 విషయాలు చివరిగా మీ ముందు ఉంచుతాను. హైదరాబాదులో కూడా ఈ అంశంపై ఏర్పాటు చేయబడిన బహిరంగ సభలో నేను ఈ నాలుగు విషయాలు ప్రస్తావించాను, ఈ నాలుగు విషయాలతోనే నేను నా ప్రసంగాన్ని ముగిస్తాను.

1) వక్ఫ్ బిల్లు గురించి, ముస్లింల అభిప్రాయం గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేయండి. సమాచారాలు సేకరించండి. ఏ జాతి అయితే ఏమరుపాటులో ఉంటుందో, తమ వ్యవహారాలు, సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండదో ఆ జాతిని దోచుకోవడం సులభతరంగా మారుతుంది. ఈరోజు కూడా చాలామంది ముస్లింలకు అసలు వక్ఫ్ అంటే ఏమిటో కనీస అవగాహన లేదు. ఈ వక్ఫ్ బిల్లులో ఏ లోపాలు ఉన్నాయో అవగాహన లేదు. లిమిటేషన్ యాక్ట్ ఏమిటి? దీని మినహాయింపు తొలగించబడితే ఏం జరుగుతుందో అవగాహన లేదు. ఈ ఏమరుపాటు, అవగాహన లోపం ఇవి అతిపెద్ద బలహీనతలు, ఇవి మనల్ని అత్యంత బలహీనులుగా మారుస్తాయి. మనకు వ్యతిరేకంగా పెద్ద పెద్ద కుట్రలు, పెద్ద పెద్ద చర్యలు అత్యంత సునాయాసమై పోతాయి. అల్హమ్దులిల్లాహ్ ఇప్పుడు ముస్లింలలో అసాధారణ చైతన్యం వచ్చింది. మేలుకొలుపు కలుగుతుంది. ఈ బహిరంగ సభ ఈ మేలుకొలుపుకు నిలువెత్తు సాక్ష్యం. నేను ఈ సభలో ఉన్న మన ఎడ్యుకేటెడ్ పర్సన్స్‌ను, యువతను, వృద్ధులను, మన బిడ్డలను, సోదరీమణులను మీరంతా క్షుణ్ణంగా వక్ఫ్ బిల్లును అర్థం చేసుకోమని కోరుతున్నాను. చాలా మెటీరియల్ అందుబాటులో ఉంది. పుస్తకాలు, ప్రతి భాషలో వ్యాసాలు ఉన్నాయి. యూట్యూబ్‌లో లెక్చర్స్ ఉన్నాయి. వక్ఫ్ అంటే ఏమిటి? ఈ బిల్లులో ఉన్న లోపాలు ఏమిటి? అనే విషయాలు సరిగ్గా అవగాహన చేసుకోండి.

2) సోదరులారా, సోదరీమణులారా! మన అతి పెద్ద బాధ్యత ఏమిటంటే బిల్లు గురించిన సరైన అవగాహన హిందూ సిక్కు, క్రిస్టియన్ దళిత సోదరులకు కల్పించాలి. ఏ ప్రచారాల దుమారం ప్రస్తుతం చెలరేగుతుందో, వివిధ తప్పుడు విషయాలు ప్రచారం చేయబడుతున్నాయో గమనించండి. ముస్లింలు ఎక్కడైతే నమాజు చదువుతారో అది వక్ఫ్ అయిపోతుంది అని అంటు న్నారు. హైదరాబాద్ మహాసభలో ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు విచ్చేశారు, వారు ఇలా అన్నారు: రైళ్లలో, విమానాల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు అక్కడ ముస్లింలు నమాజు చదువుతుండగా చూశామని, మరైతే ఎన్ని ట్రైన్స్, ఏరోప్లేన్స్ ఇప్పటివరకు మీరు వక్ఫ్‌లో రిజిస్టర్ చేయించారో చెప్పాలని ప్రశ్నించారు. ఎక్కడ ముస్లింలు నమాజ్ ఆచరిస్తారో అది వక్ఫ్ అయిపోతుందనే ఈ తప్పుడు అభిప్రాయాలను దూరం చేయడం మన బాధ్యత. ముస్లిమేతర సోదరులతో కలవండి. వ్యాసాలు రాయండి. యుట్యూబ్ వీడియోస్ పోస్ట్ చేయండి. వారిని కలిసి మాట్లాడండి. యువత, విద్యార్థులను కలవండి. సరైన విషయం, వాస్తవం ఏమిటో వారి ముందు ఉంచండి. వారికి వక్ఫ్ అంటే ఏమిటో తెలియ పరచండి. అది ఉనికిలోకి ఎలా వచ్చింది? ముస్లింలు దాని విషయంలో ఎందుకు ఇంత సున్నితంగా వ్యవహరిస్తు న్నారు? వివరించండి. ఇది రెండవ అతి ముఖ్యమైన బాధ్యత.

ఆంధ్రప్రదేశ్‌లో అల్హమ్దులిల్లాహ్ దేశ సోదరులలో, అన్ని మతాలకు సంబంధించిన వారిలో పరస్పర సంబంధాలు చాలా మెరుగ్గా ఉన్నాయి. ఒకవేళ మీరు ఈ బాధ్యత తీసుకుంటే రాబోయే నెల రెండు నెలల్లో ఆంధ్రప్రదేశ్లోని ప్రతి పౌరుడు వక్ఫ్ గురించిన వాస్తవాన్ని తెలుసుకునే విధంగా చేయవచ్చు. అపోహలు తొలగించవచ్చు. ఇదే మనం నిర్వర్తించవలసిన రెండవ బాధ్యత.

3) మీ మీ ప్రాంతాలలో, మీ ఎమ్మెల్యే, ఎంపీ నియోజకవర్గా లలో నేతలను జవాబుదారులుగా మార్చండి. వారిని ప్రశ్నించండి, ఈ బిల్లును వ్యతిరేకించడం కొరకు మీరేం చేస్తున్నారు? ఈ బాధ్యతను మీరు ఎంతవరకు నిర్వర్తించారు? ప్రశ్నించండి. ప్రశ్నించడం కూడా మీ బాధ్యత. కేవలం ఓట్లు వేసి కూర్చోవడం కాదఱు. పౌరులు ఎవరికైతే ఓటు వేసి గెలిపించారో, వారిని జవాబుదారులుగా మార్చడం కూడా పౌరుల బాధ్యతే. వారిని అకౌంటేబుల్‌గా మార్చాలి. వారిని ప్రశ్నించండి, అడగండి. వారిని జవాబుదారులుగా మార్చండి. మీ ఒత్తిడి మాత్రమే వాస్తవానికి ఈ బిల్లును వ్యతిరేకించడంలో సహాయపడుతుంది. ఒత్తిడి కొరకు ఈ కాన్ఫరెన్స్ అయితే ఒక శుభారంభమే, కానీ ఇది ముగింపు

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

కానే కాదు. మీ మీ ప్రాంతాలలో ప్రశ్నించండి. ఇది మూడవ అతిపెద్ద బాధ్యత, దీనిని మీరు నిర్వర్తించాలి.

4) సోదరులారా, సోదరీమణులారా, పెద్దలారా, మిత్రులారా! ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అందులో మొత్తం ముస్లిం వర్గాలు ఉన్నాయి. ఇది అందరి ఉమ్మడి వేదిక. ఇదే వక్ఫ్ వ్యవహారాలను ప్రస్తుతం లీడ్ చేస్తుంది. పూర్తి ఉద్యమాన్ని నడిపిస్తుంది. అయితే ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఎప్పుడు, ఏం సూచనలు చేస్తుంది అనే విషయమై పూర్తి శ్రద్ధతో ఎదురుచూస్తూ ఉండండి. మిమ్మల్ని ఈ-మెయిల్ చేయమని కోరగా మీరు పెద్ద ఎత్తున ఈ-మెయిల్ చేశారు. మిమ్మల్ని మహాసభలు నిర్వహించమని అంటే మహాసభలు ఆరంభించారు. భవిష్యత్తులో కూడా పర్సనల్ లా బోర్డ్ తరపునుంచి ఏ అప్పీల్ వస్తుందో ఆ అప్పీల్ పై మనందరం కలిసి రెస్పాండ్ అవుదాం. అంతా కలిసి కచ్చితంగా రెస్పాండ్ అవుతామని ప్రకటించండి. పర్సనల్ లా బోర్డ్ ఏ పని చేయమని సూచిస్తుందో దాని కొరకు మనం మనసా వాచా కర్మణా సిద్ధంగా ఉన్నాము. ఈ ఐకమత్యంతోనే వారిపై ఒత్తిడి కలుగుతుంది. దీనితోనే ఈ బిల్లును అడ్డుకోగలం.

గౌరవనీయమైన పెద్దలారా, మిత్రులారా! ఈ మహాసభను ఆరంభంగా భావించండి. ఇక్కడి నుండి ఈ సమాచారాన్ని తీసుకుని వెళ్లాలి. పైన ప్రస్తావించిన నాలుగు బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తించాలి. మనలోని ప్రతి ఒక్కరూ అల్లాహ్ ఆస్తికి అమానతుదారులం అనే భావన కలిగి ఉండాలి. నేను, మీరు, మీలోని ప్రతి ఒక్కరూ, మహిళలు కూడా అమానతు దారులే. మనందరం అమానతు దారులమే. ఈ అమానతు హక్కును నెరవేర్చడం కొరకు ఏదైతే మనకు సాధ్యపడుతుందో ఇన్ షా అల్లాహ్ మనమంతా ఆ పని తప్పకుండా చేద్దాం. నిరంతరంగా చేస్తూనే ఉందాము.

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించబడినటువంటి ఈ మహత్తర సభ ఇన్ షా అల్లాహ్ వక్ఫ్ బిల్లు అమెండ్మెంట్ 2024 ఆమోదం పొందకుండా ఉండడానికి గొప్ప కారణంగా మారుతుందని ఆశిస్తున్నాను.

అల్లాహ్ మనందరికీ మన మన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించే సద్భాగ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను... ఆమీన్!

# ఓ ఉద్యమ సహచారీ!

- మలిక్

ఓ ఉద్యమ సహచారీ వినరావా ఒక సారి:
ఈ జీవన సంగ్రామం ఓ ముగియని సంయానం
సంవేదన కాలంలో దరి చేరని ఓ గమ్యం!
క్షణ క్షణం శరవేగంతో సాగుతోంది నిరీక్షణం
దాటుకుంటూ పోతోంది, దాగుండి పోతోంది!!

పూర్వీకుల లే యెండ, సాయంత్రపు కిరణాలు
కరకాలపు కొండ వెనుక మరుగున పడిపోయాయి
నెత్తుటి కన్నీటితో కనుమూసింది క్షితిజం!

ఏ పడమటి కనుమల్లో, ఏ కర్కశ ఛాయల్లో
మన వెలుగు తెరలన్నీ మాయమయి పోయాయో!
మిణుకు మిణుకుమంటున్న నవ తారల దీపాలు
మసక మసక వెలుగుల్లో నడయాడే హడావిడి
నిశ్శబ్ద శబ్దంతో పోరుతున్న ఘోషణలు
ఈ తూరుపు వెలుగుల్ని ఆ పడమటి చీకట్లు
తరుముకుంటూ వస్తున్నాయి, ముసురుకుంటూ వస్తున్నాయి!!

సంశయాల సంఘర్షణ, నమ్మకం లేని బతుకు
ఇప్పుడిప్పుడే సర్వం తలెత్తుకు వస్తున్నాయి
ఈ మనుగడ కార్ఖానా ఎంత కాలమీ రీతిన?
తెల్లవారె ఆశలతో మాడుతోంది మన రేయి!
ఈ దృశ్యం కోరుతుంది – నీ మేధ, నీ దృష్టి,
నీ రాతిరి నిదురల్ని, నీ అంతర్వేదననూ
ఆంతర్య రోదననూ – నీ సర్వం కోరుతోంది!

రేయి ముగిసి ఎన్నడు తెల్లవారు మేల్కొంటూ
వళ్ళు విరిచి, ఆవలించి, కళ్ళు తెరిచి– నవ్వుతుందో!

ఉదయభాను నిరీక్షణం ఎంత కాలమెంత కాలం?!
ఆంతర్య జ్వాలలతో దీవిటీలు వెలిగిద్దాం!!
పెనురేయి గుండెల్లో వెలుగు బాట వేసేద్దాం!!!

నిద్ర మబ్బు వీడేలా శిబరాల పంక్తుల్లో
జాగరూక ఆత్మలు మనసారా ఊదాలి!
సమయ లేమిని ఎదిరించి బహుదూరాన ఉన్న
మనసు పడి కోరుకున్న ప్రేమ గమ్యం చేరాలి!!

'చరితార్థులు'-2



# కల్నల్ జి. క్యూ. జీలాని




65

**మాతృభూమికి** స్వాతంత్ర్యం సిద్ధించాలంటే బ్రిటిష్ భారత సైన్యాలను సాయుధ సైనికశక్తి ద్వారా మాత్రమే ఎదుర్కొవాలన్న దృఢ నిర్ణయానికి వచ్చిన కెప్టన్ మోహన్ సింగ్, సుభాష్ చంద్రబోస్‌లు నాయకత్వం వహించిన తొలి – మలి 'భారత జాతీయ సైన్యం'లో అధికారిగా కల్నల్ జి.క్యూ.జీలాని బృహత్తరమైన బాధ్యతలను నిర్వహించారు. బ్రిటిష్ భారత సైన్యంలోని భాహావల్‌పూర్ రాష్ట్ర పదాతి దళానికి చెందిన ప్రథమ బెటాలియన్‌కు చెందిన ఆయన ద్వితీయ ప్రపంచ యుద్ధంలో భాగంగా మలయా ప్రాంతానికి వెళ్ళారు. 1942 ఫిబ్రవరి 17 తరువాత కెప్టన్ మోహన్ సింగ్ 'భారత జాతీయ సైన్యం' ఏర్పాటుకు ఉపక్రమించడంతో జీలాని, సింగ్‌కు పూర్తి స్థాయిలో సహకరించారు. తూర్పు ఆసియాలో భారత స్వాతంత్ర్యోద్యమాన్ని నడుపుతున్న 'ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్' నాయకులు రాస్ బిహారి బోస్ నేతృత్వంలో 1942 జూన్ 15 నుండి 23 వరకు బ్యాంకాక్‌లో జరిగిన సమావేశంలో జీలాని పాల్గొన్నారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఏర్పడిన 'కార్యాచరణ సమితి'లో సభ్యులుగా నియుక్తులైన ఆయన సైనిక శిక్షణ కార్యక్రమాల బాధ్యతలను చేపట్టారు. ఆ తరువాత జపాన్ ప్రభుత్వంతో ఏర్పడిన పొరపొచ్చాల కారణంగా జనరల్ మోహన్ సింగ్ భారత జాతీయ సైన్యాన్ని రద్దుచేయాలన్న తీవ్ర నిర్ణయం తీసుకున్నప్పుడు కల్నల్ జి.క్యూ. జీలాని ఆయన వెంట నిలిచారు. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో జనరల్ మోహన్ సింగ్‌ను జపాన్ ప్రభుత్వం అరెస్టు చేసి గృహనిర్బంధంలో ఉంచిన తరువాత జి.క్యూ. జీలాని పెనాంగ్ లోని భారత జాతీయ సైనికుల అధికారుల శిక్షణాకేంద్రానికి వెళ్ళిపోయారు. 1943 జూన్‌లో సుభాష్ చంద్ర బోస్ సింగపూర్ చేరుకుని భారత జాతీయ సైన్యాన్ని పునర్నిర్మించిన తరువాత ఆయన పిలుపు మేరకు జి.క్యూ. జీలాని సింగపూర్ వచ్చారు. ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్ లోనికి యువతను రిక్రూట్ చేయడం వారికి సైనిక శిక్షణ ఇచ్చే బాధ్యతలను నేతాజీ సుభాష్ చంద్రబోస్ కల్నల్ జీలానికి అప్పగించారు. ఆ తరువాత ప్రపంచ యుద్ధ పరిణామాల మూలంగా 1945 నాటికి జపాన్ పరాజయం కావడంతో సింగపూర్‌లోని భారత జాతీయ సైన్యాధికారుల తోపాటుగా ఆయన కూడా అరెస్టయ్యారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక కల్నల్ జి.క్యూ. జీలాని విడుదలయ్యారు.

✤



9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీష్) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# ప్రతిభకు చదువు అవసరమా?



డా॥ మహ్మద్ హసన్

**ప్రస్తుతం** పట్టభద్రుల కంటే "వృత్తి నిపుణుల" అవసరమే ఎక్కువ. చాలామంది నాలుగేళ్ళపాటు కాలేజీలో సమయం వృధా చేస్తారు. చివరికి ఉపయోగపడే నైపుణ్యాలేవి వారి వద్ద ఉండవు. నేడు ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్, కమ్మరి వంటి "వృత్తి నిపుణులు" కావాలి. సక్సెస్ అయ్యేందుకు డిగ్రీ పట్టా "అవసరం లేదు" అని టెస్లా అధినేత "ఎలన్ మస్క్" అభిప్రాయం. పైన ఉదహరించ బడిన వాక్యాలతో నేనుపూర్తిగా ఏకీభవించనుగాని కొంతమేరకు సమర్ధించగలను. ఎందుకంటే ప్రపంచంలో చాలామంది చదువుతో సంబంధం లేకుండానే వారి వారి ప్రతిభా, నైపుణ్యాల ఆధారంగా వివిధ రంగాలలో రాణించి సమాజానికి ఉపయోగపడే నూతన యంత్రాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించి చరిత్రకెక్కిన దాఖలాలు ఉన్నాయ్.

అంతంత మాత్రం చదువులతో వారి వద్ద వున్న ప్రతిభా పాటవాలతో, నైపుణ్యాలతో వాసికెక్కిన వారు కూడా వున్నారు వారిలో లూయిస్ బ్రెయిలీ (బ్రెయిలి లిపి ఆవిష్కర్త) థామస్ ఆల్వాఎడిసన్, బిల్‌గేట్స్, రైట్ సోదరులు, లారీఎల్లీసన్, మైకేల్ డెల్ మొదలైనవారు. భారతీయ క్రికెట్ చరిత్రలో ఎన్నో మైలు రాళ్ళను అధిగమించిన క్రికెట్ దిగ్గజం "సచిన్ టెండుల్కర్" కేవలం పదవ తరగతి మాత్రమే చదివాడన్న విషయం ఎంత మందికి తెలుసు? కాని అతనిలోని ప్రతిభా నైపుణ్యాలను గమనించిన అతని సోదరుడు. (అజిత్ టెండుల్కర్) రమాకాంత్ అచ్రేకర్ వద్ద క్రికెట్ మెళకువలు నేర్చుకోవడానికి పంపించాడు, ఆ తర్వాత అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో సాధించిన విజయాలు, రికార్డులు అన్నీ ఇన్నీ కావు. అంటే ఇక్కడ సచిన్ టెండుల్కర్ చదువు ద్వారా పేరు ప్రతిష్ఠలు పొందలేదు, అతని లోని "క్రీడా నైపుణ్యం" ద్వారా మాత్రమే ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నాడన్న విషయం మరువ కూడదు. అతి పిన్న వయస్సులో భారతరత్న అవార్డు (2014) పొందిన వ్యక్తిగా మరో చరిత్రను సృష్టించాడు. సచిన్ టెండుల్కర్ పేరు ప్రపంచవ్యాప్తంగా చాలామందిని ప్రభావితం చేసింది. అతడిని స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది యువక్రీడాకారులు భారత జట్టులో చోటు సంపాదించి రాణించటం గొప్ప విశేషం.

ఇక మూడవ వ్యక్తి డా॥యం.కిరణ్ కుమార్ "డబ్బులు ఊరికే రావు" అంటూ ప్రతిరోజు టీ.వీలలో దర్శనమిచ్చే ఇతడు కనీసం ప్రాథమిక స్థాయిలోనే విద్యాభ్యాసం ముగించి ఓ బంగారు షాపులో పని నేర్చుకోవడానికి వెళ్ళాడన్న విషయం ఎంతమందికి

తెలిసి వుంటుంది? నేడు వెయ్యి కోట్లకు అధిపతిగా ఎలా మారాడు? దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో అనేక శాఖల ద్వారా తన వ్యాపార కార్యకలాపాలను నేటికి విస్తరిస్తూనే ఉన్నాడు. మరొక వ్యక్తి లూయిస్ బ్రెయిలీ ఇతడు బాల్యంలోనే ఒక కన్నుకి సోకిన ఇన్ఫెక్షన్ రెండవ కన్నుకి కూడా వ్యాపించి శాశ్వతంగా రెండు కళ్లను కోల్పోవలసి వచ్చింది. అతడు పెరిగి పెద్దైన కొద్ది తన లాంటి అంధులకు మార్గదర్శకుడిగా ఏదో చేయాలన్న "సంకల్పం" అతడిని "బ్రెయిలి లిపిని" ఆవిష్క రించేలా చేసింది. అదే నేడు చిన్నచిన్న మార్పులతో ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది అంధుల జీవితాల్లో కొత్త వెలుగులు చూయిస్తోంది. ఇక మరొక వ్యక్తి థామస్ ఆల్వాఎడిసన్ (ఫిబ్రవరి- 11, 1847 అక్టోబర్ 18, 1931) ఎనిమిది సంవత్సరాల వయస్సులో స్కార్లెట్ ఫీవర్" వల్ల పాఠశాలకి ఆలస్యంగా వెళ్లటం జరుగుతుంది. అప్పుడు పాఠశాల లోని ఓ టీచర్ ఇతడిని మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడని పాఠశాల నుండి బహిష్కరించటం జరిగింది. అనంతరం అతడిని పాఠశాల నుండి ఇంటికి తీసుకొనివచ్చిన తన తల్లి (నాన్సి ఈలియట్) టీచర్‌గా మారి పాఠాలు బోధిస్తుంది. బైబిల్, అర్థమెటిక్, వ్రాయడం, చదవటం, చిన్నచిన్న కథలు మొదలైనవి గురువుగా మారి చదువు నేర్పింది, అలా అంతంత మాత్రం చదువుతోనే ఎడిసన్ ''బల్బును'' ఆవిష్కరించిన విషయం అందరికి తెలిసినదే కదా! ఇక్కడ థామస్ ఆల్వా ఎడిసన్ ఏ యూనివర్సిటీ నుండి కూడా పరిశోధనా పట్టా కాని డిగ్రీ స్థాయి పట్టా కాని అందుకో లేదన్న విషయం ఎంతమందికి తెలుసు.? అంటే ఎడిసన్ చదివింది గొప్ప చదువు ఏం కాదు. కేవలం తనలోని ''ప్రతిభ'' ఆధారంగానే ప్రపంచానికి పరిచయం అయ్యాడు. ఇక చివరి వ్యక్తి మైక్రోసాఫ్ట్ వ్యవస్థాకుడు "బిల్ గేట్స్" (విలియం హెన్రీ అసలు పేరు) ఇతడు కూడా అంతంత మాత్రం చదువును మాత్రమే కొనసాగించాడు. పాఠశాల దశలోనే తన మిత్రుడు పాల్ అల్లెన్‌తో కలిసి కంప్యూటర్ లాంగ్వేజ్ ఐన బేసిక్ (BASIC) నేర్చుకొని అందులో ప్రోగ్రాములు వ్రాయటం మొదలుపెట్టాడు. అలా ప్రారంభమైన అతని జీవితం ఈరోజు అమెరికాలోని సంపన్నులలో మొదటి వరుసలో ఉన్నాడంటే ఆశ్చర్యపోవలసిందే. వీటికి తోడు ''మిలిండాగేట్స్ ఫౌండేషన్'' ద్వారా అనేక దాతృత్వ కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్తంగా కొనసాగించటం గొప్ప విషయం. అదేవిధముగా ల్యారి ఇల్లిసన్, మైకేల్ డెల్ ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాలా పెద్దదవుతుంది.

అంటే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే మనిషి జన్మత: సహజ సామర్థ్యాల ఆధారంగానే ఈ ప్రపంచంలోకి ఆహ్వానింపబడతాడు. పెరిగి పెద్దవాడవుతున్న కొద్దీ అందుబాటులో వున్న సదుపాయాలు, సౌకర్యాల ద్వారా మనిషి తన ఆలోచనలను మెరుగుపర్చుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. సహజంగా అందరికి ఒక ప్రశ్నరావచ్చు "ప్రతిభకి చదువు అవసరమా"? అనేది. ఇక్కడ మనం గమనించాల్సిన విషయ మేమిటంటే ఆది మానవుడు ఏమీ చదువుకోలేదు తన ప్రాణ రక్షణ కోసం క్రూరమృగాల నుండి ఎలా కాపాడుకోవాలన్న ఆలోచన అతడికి/ఆమెకి వచ్చినప్పుడు వాటి నుండి తనను తాను రక్షించుకోవడానికి, ఈటెలు, బరిసెలు, ఎత్తైన చెట్లు, కొండ గుహలు సురక్షితంగా ఉంటాయని భావించాడు. ఇక్కడ అతనికి తట్టిన ఆలోచన మాత్రమే ఉపయోగపడింది. అనంతరం యాదృచికంగా దొరికిన కాల్చిన మాంసం రుచిగా ఉండటంతో పచ్చి మాంసం స్థానంలో కాల్చిన మాంసాన్ని తినాలన్న ఆసక్తి పెరగటంతో 'నిప్పును' కనిపెట్టాడు. అప్పటి నుండి మనిషి ఆహారపు అలవాట్లు జీవనశైలి మారటం మొదలైంది.

లూయిస్ బ్రెయిలీ, థామస్ ఆల్వాఎడిసన్, బిల్‌గేట్స్, రైట్ సోదరులు, లారీ ఎల్లీసన్, మెకేల్‌డెల్ మొదలైన వారు ప్రపంచ ప్రసిద్ధి పొందిన విశ్వవిద్యాలయాలలో చదువుకోనప్పటికీ వీరిలో వున్న ప్రతిభ, సహజ సామర్థ్యాలు, నైపుణ్యాలు ఆధారంగా ప్రపంచ ప్రసిద్ధమైన వ్యక్తులుగా ఎదిగారు, ఆయా రంగాలను ప్రభావితం చేసి సమాజానికి, నేటి యువతకు స్ఫూర్తి సందేశం ఇచ్చారు. మరి చదువు ఎందుకు అవసరం? అనే ప్రశ్న అందరికి ఉదయించక మానదు. చదువు ద్వారా "సృజనాత్మక ఆలోచనలు, భిన్న వైఖరులు, తెలియని విషయాలు" తెల్సుకొని ఇంకొంచెం మెరుగ్గై తనను తాను తీర్చిదిద్దుకోవడానికి చదువు మనిషికి ఉపయోగపడుతుంది. చదువుకోవటం మూలంగానే మనిషి శిల

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక

సహజీవన భావనల పొదురాయి
గీటురాయి
వారపత్రిక



# ముస్లిమేతరులతో ప్రవక్త (స)

సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి**

## ధన ప్రాణాల రక్షణ

వారి రక్తం మా రక్తం వంటిది. వారి ధనం మా ధనం వంటిది' అని ఒక సందర్భంలో చెబుతూ ఆయన (సఅసం) ఇలా అన్నారు. "ఎవరయితే ఏదయినా ఒక ఒడంబడికను (శాంతియుతమైన జీవితం గడిపేందుకు ముస్లిమేతరునితో చేసుకున్న ఒడంబడికను) భగ్నపరుస్తాడో, అతను స్వర్గం సువాసనను కూడా ఆఘ్రాణించ లేడు. నిజానికి దాని సువాసన నలభై ఏండ్ల ప్రయాణ దూరం నుండి వస్తూ ఉంటుంది." (బుఖారీ)

"జాగ్రత్త! ఎవడయితే తాను ఒడంబడిక చేసుకున్న వాని (ముస్లిమే తర వ్యక్తి)పై దౌర్జన్యం చేశాడో, అతని హక్కును హరించాడో లేదా అతని సమ్మతి లేకుండానే అతని హక్కును లాక్కున్నాడో ప్రళయదినాన నేను ఆ బాధితుని పక్షం వహిస్తాను"

(అబూ దావూద్)

సాధారణ సమయాల సంగతి అలా ఉంచండి, యుద్ధం లాంటి విపత్కర పరిస్థితిలో కూడా ఆయన(స) ఈ ప్రమాణాలను విధిగా పాటించేవారు. శత్రువు ఆయుధాలు పడవేసి ఆత్మ సమర్పణ చేసుకున్నప్పుడు లేదా సంధికి సిద్ధపడినప్పుడు అతని సొమ్ములకు ఎలాంటి నష్టం కలిగించరాదని చెప్పేవారు.

## వ్యాపార సంబంధాలు

వర్తక సంబంధాలలో ఆయన (స) ముస్లిం-ముస్లిమేతరుల మధ్య ఎలాంటి విచక్షణ చూపలేదు. తొలికాలంలో అబూ సుఫ్యాన్, జుబైర్ బిన్ ముత్యిమ్ అనే వర్తకులు ఇస్లాం స్వీకరించలేదు. అయితే ఆ సమయంలో కూడా ఆయన (స) వర్తకం కొరకు తన వర్తక సామగ్రిని వారికి ఇచ్చేవారు. వచ్చిన లాభాలలో ముందుగా నిర్ధారించుకున్న దాని ప్రకారం వాటా తీసుకునేవారు. మదీనాలోనైతే ముస్లింల వర్తకమంతా - సాధారణంగా యూదుల (బనూ ఖైనుఖా) మార్కెట్లోనే సాగేది.

దైవప్రవక్త (సఅసం) ముస్లిమేతరులతో క్రయ విక్రయాలు జరిపేవారు. ఆయన (స) పరమపదించిన సమయంలో కూడా ఆయనగారి ఒక రక్షా కవచం ఒక యూదు వ్యక్తి వద్ద తాకట్టుగా ఉంది. ఎందుకంటే ఆయన (స) ఆ యూదు వ్యక్తి వద్ద మూడు 'సా'ల (అరేబియాలో అప్పటి ఒక కొలమానం) బార్లీ గింజలు అరువుగా కొనుగోలు చేశారు (బుఖారీ).

అలాగే ఆయన(స) ముస్లిమేతర వ్యక్తులను తన దగ్గర సేవకులుగా నియమించుకునేవారు. ఆయన (స) మక్కా నుండి మదీనాకు హిజ్రత్ చేసినప్పుడు, ఎడారిలో దారి చూపగల నమ్మకస్తుడైన ఒక వ్యక్తి అవసరం ఏర్పడింది. ఆయన (స) ఎంతో

బాధ్యతతో కూడుకున్న ఈ పని కోసం ఒక ముస్లిమేతర వ్యక్తిని వేతనంపై నియమించుకున్నారు (అహ్కామ్ అహ్లుజిమ్మహ్)

## న్యాయం, సమభావం

ఆయన న్యాయ వ్యవహారం కేవలం తన సహచరుల పరకే పరిమితం కాలేదు, తన వ్యక్తిగత విషయంలో కూడా ఆయన(స) పూర్తిగా దీనికి కట్టుబడి ఉన్నారు. తాను ఎవరికయినా బాకీ పడి వుంటే రుణదాతకు అడిగే హక్కు కచ్చితంగా ఉంటుందని క్రియాత్మకంగా నిరూపించారు. ఒకవేళ బాకీ వసూలు విషయంలో రుణదాత కరకుగా మాట్లాడినా సహించి ఊరుకునేవారు. ఆయన(స) జైద్ బిన్ సానా అనే యూదు వ్యక్తి వద్ద అప్పు తీసుకున్నారు. అతను వచ్చి దైవప్రవక్త (స) అంగీని పట్టుకుని లాగుతూ పరుష వాక్యాలు పలికాడు. 'నా రుణం తీరుస్తావా లేదా? ఎందుకు తీరుస్తావులే? బనీ ముత్తలిబ్ వంశస్తులంతా ఇంతే. దాటవేసే రకం' అన్నాడు. ఈ మాట వినగానే హజ్రత్ ఉమర్ (రజి) చివాలున లేచి నిలబడ్డారు. యూదు వ్యక్తిని ఒక్క తోపు తోశారు. అప్పుడు దైవప్రవక్త (స) ఉమర్ని వారిస్తూ, "ఉమర్! నేనయినా, ఇతనయినా నీ నుండి ఆశించింది ఇది కాదు. ఉత్తమ రీతిలో అప్పు తీర్చండి అని నీవు నాకు చెప్పాల్సింది, సరైన పద్ధతిలో అడగమని అతనికి నచ్చజెప్పాల్సింది. కాబట్టి ఇప్పుడు నువ్వెళ్ళి అతని అప్పు తీర్చిరా. నువ్వతన్ని భయపెట్టినందుకు బదులుగా ఇరవై 'సా'ల ఖర్జూరాలు అధికంగా ఇవ్వాలి" అని తాకీదు చేశారు (ముస్తద్రక్ హాకిమ్).

## మన్నింపుల వైఖరి

ఒకసారి మక్కాలో తీవ్ర దుర్భిక్షం తాండవించింది. ప్రజలు మృత జంతువును సయితం తినాల్సిన అగత్యం ఏర్పడింది. మరి చూడబోతే ఆ జనులు ఎవరో కాదు, దైవప్రవక్త (స)ను, ఆయన ప్రియసహచరులను సంఘ బహిష్కరణ చేసి ఒక్కో ఆహార ధాన్యపు గింజ కూడా వారికి చేరకుండా అడ్డుకున్నవారు. మక్కాలో ముస్లింలు నాలుగేండ్ల వరకూ ఈ కఠినమయిన ఆర్థిక ఆంక్షలను భరించారు. కాని ఆయన (స) మదీనాకు హిజ్రత్ చేసిన మీదట మక్కాలో కరువు కాటకాలొచ్చి అక్కడి ప్రజలు తిండికి తిప్పలు పడాల్సిన దుస్థితి దాపు రించింది.

ఆశీర్వచనాలు దివ్యతరంగాలై చెడుని పారదోలతాయి. అజ్ఞానాన్ని పటాపంచలు చేస్తాయి. కమ్ముకున్న మాయని మటుమాయం చేస్తాయి. అందుకే ఏ పని మొదలు పెట్టినా ఆశీర్వచనాల కోసం అర్రులు చాచాలి. అనుభవజ్ఞులు, పెద్దవాళ్లు, తల్లిదండ్రులు, గురువుల ఆశీస్సులు మెండుగా తీసుకోవాలి. ఆశీర్వచనాల పంట పండితే మనం తలపెట్టే పనులకు ఎదురుండదు. అపజయం మాట వినపడదు. జయం పరుగులు తీసి ముందుకు వస్తుంది. ఈ యదార్థం తెలిసిన మక్కా నాయకులు ఆయన (స) దగ్గరకు వచ్చి, 'తమరు బంధువుల యెడల ఉత్తమంగా మెలగమని బోధిస్తారు కదా! ఇప్పుడు మీ జాతి వారు దుర్భర దారిద్ర్యంతో అంతమవుతున్నారు. కాబట్టి తమరు ఈ దుర్భిక్షాన్ని దూరం చేయమని దైవాన్ని ప్రార్థించండి' అని కడు దీనంగా అభ్యర్థించారు. ఈ మాటలకు కారుణ్యమూర్తి (స) హృదయం కరిగిపోయింది. ఆయన (స) చేతులెత్తి వారి కష్టాన్ని తొలగించమని అల్లాహ్ను వేడుకున్నారు. తరువాత మక్కాలో పుష్కలంగా వానలు కురిశాయి (బుఖారీ)

**(సమాప్తం)**

---

**31వ పేజీ తరువాయి...**

నుండి శిల్పంగా మారే అవకాశం వుంటుంది. కొత్త కొత్త ఆవిష్కరణలు చేసి మార్పులు, చేర్పులు చేస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపు పోకడలు మొదలైనవన్ని తెల్సుకోగల్గుతాడు. ఆది మానవుడికి అంతరిక్షంలోకి వెళ్లాలన్నా, చంద్రమండలంలోకి వెళ్లాలన్న ఆలోచన ఒకవేళ వారికి వచ్చి ఉంటే అది అప్పట్లో వారికి సాధ్యం కాలేదు. నేడు అంతరిక్ష కేంద్రం "సునితా విలియమ్స్, విల్మోర్"లు ఉన్నారంటే వారికి వారిలో ఉన్న ప్రతిభతో పాటు వారు చదువుకున్న "చదువు" కూడా ఉపయోగ పడింది. కాబట్టి మనిషిలో కల్గిన ఆలోచనే చంద్ర మండలానికి చేరువకావడానికి "చదువు" ఉపయోగపడిందని భావించాలి. మనిషి ఆలోచన ద్వారానే (చదువు) రాబోయే ఉపద్రవాలను ముందే పసిగట్టి నష్టనివారణను చేయగల్గుతున్నాం. అలాగే మనిషిలో మొదలైన ఆలోచనే కొత్త ఆవిష్కరణలకు దిక్సూచి అయింది.

కాబట్టి ఎలన్మస్క్ చెప్పినట్లుగా ఏమీ చదువుకోని వ్యక్తి యొక్క ప్రతిభ నైపుణ్యం వేరు, చదువుకున్న వ్యక్తి యొక్క ప్రతిభ నైపుణ్యం వేరుగా ఉంటుందనేది మనం గమనించాలి. రైట్ సోదరులు కనిపెట్టిన నాటి విమానానికి నేడు నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నడుస్తూ భవిష్యత్తులో కూడా అనేక మార్పులను మనం చూడగలం. కావున "చదువు" అనేది ప్రతిభావంతుడికి అదనపు బలంగా ఉపయోగపడుతుందని ఖచ్చితంగా చెప్పవచ్చును.

❖

# మూడు శాపాల నుండి తప్పించుకోండి!

ముహమ్మద్ వహీదుద్దీన్

**ఒకసారి** మహాప్రవక్త ముహమ్మద్ (స) తన సహచరులందరినీ మసీదు లోని ఉపన్యాస పీఠం (మింబర్) సమీపానికి రమ్మని ఆజ్ఞాపించారు. అందరూ పీఠం దగ్గరకు వెళ్ళి కూర్చున్నారు. మహాప్రవక్త(స) ఉపన్య సించేందుకు మింబర్ మొదటి మెట్టుపై తమ పవిత్ర పాదాన్ని పెట్టి 'ఆమీన్' అని పలికారు. ఆ తర్వాత రెండవ మెట్టుపై తమ పవిత్ర పాదాన్ని పెట్టి 'ఆమీన్' అని చెప్పారు. అదేవిధంగా మూడవ మెట్టుపై తమ పవిత్ర పాదాన్ని పెట్టి 'ఆమీన్' అన్నారు. ఆ తర్వాత మా వైపు తిరిగి ధర్మోపదేశం చేశారు. ఉపన్యసించిన తరువాత మింబర్ నుండి క్రిందికి దిగి వచ్చారు.

అప్పుడు సహచరులు మహాప్రవక్త(స)తో ఇలా విన్నవించు కున్నాము. మహనీయ ప్రవక్తా(స)! తమరు మింబర్‌పై ఎక్కుతున్నప్పుడు 'ఆమీన్' అని మూడుసార్లు పలికారు. ఇలా తమరు ఇంతకు ముందెప్పుడూ పలకలేదు. దయచేసి వివరించగలరా? ఆ ప్రశ్నకు జవాబుగా మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా వివరించారు. ఆ సమయంలో హజ్రత్ జిబ్రయీల్(అలై) నా వద్దకు వచ్చి నా పాదం మొదటి మెట్టుపై ఉన్నప్పుడు ఇలా శపించారు. 'ఓ అల్లాహ్! రమజాన్ పవిత్ర మాసాన్ని పొంది కూడా క్షమాపణ పొందని మానవుడిని నీవు నాశనం చేయి' ఈ వాక్యాలు విన్న నేను 'ఆమీన్' అని పలికాను.

రెండవ మెట్టుపై పాదాన్ని మోపుతుండగా మరలా హజ్రత్ జిబ్రయీల్(అలై) (దైవదూతల నాయకుడు) ఇలా శపించారు. హజ్రత్ ముహమ్మద్(స) నామాన్ని తన ఎదుట పలుకుతు న్నప్పుడు ఆ పేరు వినగానే 'దురూదె షరీఫ్'ను పఠించని వాడు నాశనమవుగుగాక! ఈ వాక్యాలు విన్న నేను 'ఆమీన్' అని పలికాను.

మూడవ మెట్టుపై పాదాన్ని మోపుతుండగా మరలా హజ్రత్ జిబ్రయీల్(అలై) ఇలా శపించారు. 'తన తల్లిదండ్రులు జీవించి ఉన్న కాలంలో వారికి సేవలు చేసి వారి దీవెనలు పొందక స్వర్గ ప్రవేశానికి అర్హత సంపాదించుకొనని వాడు నశించుగాక' అని పలకగానే నేను 'ఆమీన్' అని పలికాను.

ఈ హదీసులో జిబ్రయీల్ అలైహిస్సలామ్ మూడు శాపాలున్నాయి. ఈ మూడు శాపాలకు మహాప్రవక్త ముహమ్మద్(స) 'ఆమీన్' (అలాగే జరుగుగాక!) అని పలికారు.

ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే- హజ్రత్ జిబ్రయీల్(అలై) దైవదూతల నాయకులు. అల్లాహ్ నుండి మహాప్రవక్త(స)కు దైవగ్రంథాన్ని వహీ (దైవాజ్ఞ) ద్వారా అందించిన దైవదూత. కాబట్టి వారి శాపం సామాన్యమైనది కాదు. అలాగే ప్రవక్తల నాయకులైన ముహమ్మద్ (స) 'ఆమీన్' సాధారణమైన 'ఆమీన్' కాదు. దైవం ఇలాంటి శాపాల నుండి ప్రజానీకాన్ని రక్షించుగాక!

తుదిగేటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**